J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 16




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 40 సంచిక : 40 5.3.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



## తెలంగాణ వైపు.. ఆంధ్రానేతల చూపు

# వందల కోట్లు హైదరాబాదుకి తరలిపోతున్నాయి

**ఆంధ్రా మంత్రులు, యం.పి.లు, శాసనసభ్యులు, వారి ముఖ్య అనుచరులు (బినామిలు) హైదరాబాదులోని స్టార్ హోటళ్లలో మకాంవేసి జంట నగరాల పరిసర ప్రాంతాలలో రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులకు అనువైన ప్రాంతాలకోసం అన్వేషణ సాగిస్తున్నారు. తమ తమ నియోజక వర్గాలలో కంటే హైదరాబాదులోని స్టార్ హోటళ్లలోనే ఆంధ్రా లీడర్లు ఎక్కువగా దర్శనమిస్తున్నారు.**

ప్రపంచ పారిశ్రామిక రంగాన్ని రకరకాల తాయిలాలతో ఆకర్షించి, రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, నిరుద్యోగ నిర్మూలన వంటి అంశాలకు ప్రాధాన్యత కల్పించి, అనాధ ఆంధ్రప్రదేశ్‌ని అగాధంలో నుండి బయటపడేయాలని యువ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన పార్టీ అధికారంలోకి వచ్చినప్పటినుండి తపిస్తున్నారు. అయితే ఆయన ప్రభుత్వంలోని మంత్రులు, ఆయన పార్టీ యం.పిలు, యం.యల్.ఏలు మాత్రం తమ పెట్టుబడుల కోసం పొరుగు రాష్ట్రమైన తెలంగాణ వైపు చూస్తున్నారు.

ఏ రోజుకారోజు అంతకంతకూ పెరిగిపోతున్న హైదరాబాదు రియల్ ఎస్టేట్ వ్యాపారంపై ఆంధ్రా నేతలే ఎక్కువగా ఆసక్తి చూపడం విశేషం. ఈ విషయం విడ్డూరాన్ని, విస్మయాన్ని కలిగించేదిగా ఉన్నా ఇది ముమ్మాటికీ నిజం.

3 రాజధానుల ప్రకటనతో ఏర్పడిన అస్పష్టత కావొచ్చు, హైదరాబాదులో అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చెందిన మౌలిక వసతుల ప్రభావం కావచ్చు, అగాదాంధ్రలో కనిపించని స్పష్టమైన అభివృద్ధి కావచ్చు... కారణం ఏదైనా హైదరాబాదులో పెట్టుబడులకు మన రాష్ట్రానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులతో పాటు రాజకీయ నాయకులు, అదీ అధికార పార్టీ నేతలు ఎగబడుతున్నారు.

10లో



# నింగికెగసిన 'భారతీయ సంస్కృతి'

- పిఎస్ఎల్‌వి-సి51 సూపర్ సక్సెస్
- అంతరిక్ష కక్ష్యలోకి 19 ఉపగ్రహాలు
- ఈ ఏడాది 'ఇస్రో'కిది తొలి విజయం

*అందరూ ఊహించినట్లుగానే పిఎస్ఎల్‌వి-సి51 రాకెట్ సూపర్ సక్సెస్ అయింది. ఈ రాకెట్ మన భారతీయ సంస్కృతిని నింగిలో రెపరెపలాడించింది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా శ్రీహరికోటలోని షార్ సెంటర్‌లో ఉన్న మొదటి ప్రయోగవేదికపైనుంచి గతనెల 28న ఆదివారం ఉదయం సరిగ్గా 10 గంటలా 24 నిమిషాలకు పిఎస్ఎల్‌వి-సి51 నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకుపోయింది.*

5లో



## శుభాకాంక్షలు

పాఠకులకు, ప్రకటనకర్తలకు, చందాదారులకు, మిత్రులకు శ్రేయోభిలాషులకు

**మహా శివరాత్రి శుభాకాంక్షలు.**




మార్చి 11వ తేదీ మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 'ద్వాదశ జ్యోతిర్లింగాలు', 'పంచభూత లింగాలు' విశిష్టతపై 4 పేజీల ప్రత్యేక అనుబంధాన్ని 'లాయర్' పాఠకులకు ఈ సంచిక ద్వారా కానుకగా అందిస్తున్నాం...

- సం/-



## బంగారు గరుడవాహనంపై..

# శ్రీ లక్ష్మీనృసింహుడు

రాపూరు మండలంలోని పెంచలకోనలో కొలువైవున్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజు(బుధవారం)ను పురస్కరించుకుని ఈనెల 3న స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని బంగారు గరుడవాహనంపై కొలువుదీర్చి విశేషపూజలు చేసి మాడవీధుల్లో ఊరేగించారు. వేకువన అభిషేక సేవ అనంతరం స్వామివారికి చందనాలంకారం చేశారు. స్వామివారితో పాటు దేవేరులైన ఆదిలక్ష్మి-చెంచులక్ష్మిదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కల్యాణమండపంలో కొలువుదీర్చి పూజలు చేశారు. ఆలయం ఆవరణంలో నృసింహయాగం నిర్వహించారు. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య పర్యవేక్షణలో, ప్రధాన అర్చకులు సీతారామయ్య, పెంచలయ్య తదితరుల ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకుని తరించారు.

## పొదలకూరులోని..

# బాలాలయంలో మంటలు

- షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం
- 7 లక్షల దాకా ఆస్తి నష్టం

పొదలకూరులోని అయ్యప్పనగర్‌లో ఉన్న బాలాలయంలో ఉన్నట్లుండి అగ్నిప్రమాదం జరగడంతో స్థానిక ప్రజలు ఎంతో ఆందోళన చెందారు. మంటలను చూసిన వెంటనే పరుగుపరుగున వచ్చి వాటిని ఆర్పడానికి ప్రయత్నించారు. అగ్నిమాపకశాఖ వారికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపుచేశారు. కానీ అప్పటికే అక్కడున్న పంచలోహ విగ్రహాలు, ఉత్సవ, అభిషేక విగ్రహాలు, చాలావరకు వస్తుసామగ్రి అంతా మంటలపాలయ్యాయి.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని ఆలయ నిర్వాహకులు చెప్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. అయ్యప్పనగర్‌లో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారికి దేవాలయం నిర్మిస్తున్న నేపథ్యంలో, స్వామివార్ల విగ్రహాలను ప్రతిష్ఠించేదాకా పక్కనే బాలాలయం నిర్మించి ప్రతిరోజూ పూజలు చేస్తున్నారు. ఈనెల 2వ తేది రాత్రి ఆలయంలో ఉన్న ఇన్వర్టర్ బ్యాటరీ పేలిపోవడంతో మంటలు అంటుకున్నాయి. చుట్టుపక్కల నివాసం ఉంటున్న భక్తులు గమనించి వెంటనే మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అప్పటికే అక్కడున్న దేవతామూర్తుల విగ్రహాలు, వస్తువులు అగ్నికి ఆహుతైపోయాయని, దీంతో సుమారు 7 లక్షల రూపాయల దాకా ఆస్తినష్టం జరిగివుంటుందని చెప్తున్నారు. ఈ విషయం తెలిసి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటన సమాచారం తెలియగానే బిజెపి నాయకులు మిడతల రమేష్, సుబ్రహ్మణ్యం, రమణారెడ్డి, పిచ్చయ్య తదితరులు ఆలయాన్ని సందర్శించి ప్రమాద విషయంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.


**FORM IV**
(See Rule 8)

Statement about Ownership and other Particulars about News Paper, **Lawyer (Weekly)**

| | | |
|---|---|---|
| 1. | Place of Publication | : Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 2. | Periodicity of its Publication | : Weekly |
| 3. | Printer's Name<br>Nationality<br>Address | : Thunga Siva Prabhath Reddy<br>: Indian<br>: Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 4. | Publisher's Name<br>Nationality<br>Address | : Thunga Siva Prabhath Reddy<br>: Indian<br>: Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 5. | Editor's Name<br>Nationality<br>Address | : Thunga Siva Prabhath Reddy<br>: Indian<br>: Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 6. | Name and Address of individuals who own the News Paper and Partners or share holders holding more than one percent of the total Capital<br>Nationality<br>Address | :<br>: Thunga Siva Prabhath Reddy<br>: Indian<br>: Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |

I, Thunga Siva Prabhath Reddy hereby declare that the particulars given above are true to the best of my Knowledge and belief.

(Sd)

01.03.2021 SIVA PRABHATH REDDY.T


## పెండింగ్ పంచాయతీలకు..

# మార్చి 15న ఎన్నికలు

**4 సర్పంచ్, 54 వార్డు స్థానాల్లో పోలింగ్‌కు ఏర్పాట్లు**

జిల్లాలో పలు కారణాలతో నిలచిపోయిన 4 సర్పంచ్‌ల స్థానాలు, మరో 15 వార్డు స్థానాలకు మార్చి 15వ తేదిన ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఈ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలని ఈనెల 2వ తేదిన రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీచేయడంతో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. మార్చి 4న నామినేషన్లు, 15న పోలింగ్ జరుగనున్నాయి. అల్లూరు మండలంలోని వెలిచర్ల, మర్రిపాడు మండలంలోని కంపసముద్రం, చేజర్ల మండలంలోని వావిలేరు, మైపాటివారి కండ్రిగ పంచాయతీల్లోని సర్పంచ్ స్థానాలు, అన్ని వార్డుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అదేవిధగా అల్లూరు, బోగోలు, కావలి, వరికుంటపాడు, మర్రిపాడు, ఉదయగిరి, కలువాయి, అనంతసాగరం, బాలాయపల్లి, దొరవారిసత్రం, ఓజిలి, చిల్లకూరు, ఇందుకూరుపేట, చేజర్ల మండలాల్లో 54 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

# హుండీ దొంగలు దొరికారు

జిల్లాలోని పలు దేవాలయాల్లో హుండీలు దొంగిలించే ఇద్దరు నిందితులు ఎట్టకేలకు పోలీసులకు దొరికిపోయారు. ఈనెల 3న తోటపల్లిగూడూరు పోలీస్ స్టేషన్‌లో కృష్ణపట్నం పోర్టు సిఐ ఖాజావలి ఆ వివరాలను విలేకర్లకు తెలిపారు. నెల్లూరు శెట్టిగుంటరోడ్డుకు చెందిన పైనూరు శివ, దామవరపు బాబు ఈనెల 2వ తేది రాత్రి కోడూరు ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా గస్తీ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారని, వీరు పలు ఆలయాల్లో హుండీలు దొంగిలించినట్లు నిర్ధారణ కావడంతో వారిని అరెస్టు చేశామని చెప్పారు. తోటపల్లిగూడూరు మండలంలోని వేళాంగణి మాత చర్చి వద్ద, పాపిరెడ్డిపాళెం గ్రామంలోని కనకమ్మ దేవాలయం, వెంకటాచలం మండలంలోని అనికేపల్లి, ఆ చుట్టుపక్కలున్న గ్రామాల్లోని పలు ఆలయాల్లో వీరు హుండీలు, వస్త్రాలు చోరీ చేసినట్లు నిర్ధారించామని పేర్కొన్నారు.

## క్రికెట్ టోర్నీకి

# దరఖాస్తులు పంపండి

జిల్లాలోని అన్ని సబ్‌సెంటర్లలో క్రికెట్ టీ-10 టోర్నమెంట్‌ను నిర్వహించనున్నామని, ఈ పోటీల్లో పాల్గొనదలచిన జట్లు 15 మంది క్రీడాకారుల జాబితాతో ఈనెల 10వ తేది లోపు తమ దరఖాస్తులు పంపాలని జిల్లా క్రికెట్ సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది. జిల్లాలోని నెల్లూరు, గూడూరు, కావలి సబ్‌సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 82478 81416, లేదా 99852 33061 నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

# శ్రీకాళహస్తీశ్వరునికి 'మహా శివరాత్రి' శోభ

**6 నుంచి 19వ తేది దాకా బ్రహ్మోత్సవ వేడుకలు**



బ్రహ్మోత్సవాల సందర్భంగా విద్యుత్‌దీపాలతో శోభాయమానంగా వెలుగుతున్న శ్రీకాళహస్తీశ్వరాలయం

ఆదిదేవుడైన ఆ పరమశివుని పవిత్రమైన ఆలయంగా, పంచభూత క్షేత్రాల్లో ప్రసిద్ధమైన 'వాయు'లింగ క్షేత్రంగా వెలుగొందుతున్న శ్రీకాళహస్తీశ్వరాలయం మహా శివరాత్రి వేడుకల శోభతో అలరారుతోంది. చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తిలో వెలసివున్న ఈ ప్రసిద్ధ పుణ్య క్షేత్రంలో ఎంతో భక్తిశ్రద్ధలతో మార్చి 6వ తేదిన కన్నప్ప ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయి. ఈనెల 19వతేది వరకు జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చి 7న ఆదివారం శ్రీస్వామివారి ధ్వజారోహణం (దేవరాత్రి) జరుగుతుంది. 8వతేదీన 2వ తిరునాళ్ళు(భూత రాత్రి), 9వతేదీన 3వ తిరునాళ్ళు(గాంధర్వ రాత్రి), 10వ తేదీన 4వ తిరునాళ్ళు (నాగ రాత్రి) నేత్రపర్వంగా జరుగుతాయి. ఈనెల 11వ తేది బుధవారం మాఘ బహుళ ద్వాదశి రోజున మహా శివరాత్రి పర్వదినం కనుక, నంది సేవ, లింగోద్భవం(రాత్రి) ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. 12వ తేది ఉదయం రథోత్సవం, బ్రహ్మరాత్రి ఉత్సవాలు, తెప్పోత్సవం జరుగుతాయి. 13వ తేది రాత్రి (స్కంద రాత్రి) శ్రీ స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం ఎంతో వేడుకగా జరుగుతుంది. 14న (ఆనందరాత్రి) సభాపతి కల్యాణం వేడుక, 15న కైలాసగిరి ప్రదక్షణం, శ్రీస్వామి, అమ్మవార్ల (రుషి రాత్రి) ఉత్సవం జరుగుతాయి. 16వ తేది ఉదయం తీర్థవారి, ధ్వజ అవరోహణోత్సవం జరుగుతుంది. 17వ తేది రాత్రి పల్లకి సేవ, 18న ఏకాంత సేవ, 19న అభిషేకం, నిత్యోత్సవాలు ఆరంభమవుతాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయాన్ని రంగురంగుల దీపాలతో దేదీప్యమానం చేశారు. ఎంతో విశిష్టమైన ఈ బ్రహోత్సవాల సందర్భంగా స్వామివారికి, అమ్మవార్లకు, ఆలయంలో కొలువైవున్న దేవతామూర్తులకు ఆలయ అర్చకులు శోభాయమానంగా అలంకారాలు చేసి, విశేష పూజలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగానే కాక, దేశం నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలకు తరలివస్తున్నారు.

## సంక్షేమ పథకాలతో..

# ప్రజల నుంచి ఎనలేని ఆదరణ

**- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య**



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపడుతున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలతో వైఎస్సార్సీపికి ఎనలేని ఆదరణ లభిస్తోందని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చెప్పారు. ఈనెల 3న నాయుడుపేటలోని తన నివాసంలో ఏకగ్రీవమైన కౌన్సిలర్లను ఆయన సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రజల ముంగిళ్ళకు చేరుతుండడంతో తమ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలోని మునిసిపాలిటీల అభివృద్ధికి కోట్లాది రూపాయలను నిధులను మంజూరు చేస్తోందని చెప్పారు. మునిసిపాలిటీల్లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ప్రజలకు అందించే పథకాలన్నిటినీ నేరుగా ప్రజలకు చేరేందుకు అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, షేక్ రఫీ, కట్టా వెంకటరమణారెడ్డి, కె.సత్యనారాయణరెడ్డి, సోమశేఖర్ రెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డిలతో పాటు ఛైర్‌పర్సన్, ఛైర్మెన్ అభ్యర్థులు కటకం దీపిక, దబ్బల శ్రీమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ యూనియన్ డైరీ వచ్చింది

వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ డైరీ వచ్చింది. దాంతో పాటు క్యాలెండర్ కూడా విడుదలైంది. ఈనెల 3న నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో విద్యుత్ శాఖ ఎస్ఇ ఆదిశేషయ్య వాటిని ఆవిష్కరించి ఉద్యోగులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు రమణదేవి, శ్రీహరిరావు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ సురేంద్ర, యూనియన్ నాయకులు కోటేశ్వరరావు, సాంబశివరావు, సురేష్‌బాబు, షరీఫ్, శివ పాల్గొన్నారు.

● వరించిన అదృష్టం

# బల్లి కళ్యాణ్‌కి ఎంఎల్‌సి

## మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి



గురువారం ఉదయం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, ఆయన సతీమణి శ్వేత

**ఆ**డిన మాట తప్పకుండా తన విశ్వస నీయతను మరోసారి నిలబెట్టుకున్నారు ఆంధ్రా ముఖ్యమంత్రి జగన్. కరోనా మహమ్మారికి బలైపోయిన తిరుపతి పార్ల మెంటు సభ్యుడు బల్లి దుర్గాప్రసాద్ కుటుం బానికి తానున్నానని భరోసా ఇచ్చినట్లుగానే బల్లి కుమారుడు కల్యాణచక్రవర్తికి యం.యల్.సి ఇచ్చి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. మాటతప్పని, మడమ తిప్పని రాజన్న బిడ్డగా మరోసారి నిరూ పించుకున్నారు. రాజకీయ నిరుద్యోగులతో నిండిపోయి ఉన్న వైసిపిలో ఈసారి అదృష్టం ఎవరిని వరిస్తుందో అని అందరూ అనుకుంటున్న తరుణంలో ఇక్కడ బల్లి దుర్గాప్రసాద్ కుటుంబానికి, కర్నూలులో చల్లా రామకృష్ణారెడ్డి కుటుంబానికి ఇచ్చిన మాట ప్రకారం వారికే అవకాశం కల్పిం చారు. రాష్ట్రమంతా ఉన్నట్లుగానే నెల్లూరు జిల్లాలో కూడా ఆశావహుల లైన్ పెద్దది గానే వుంది. మే, జూన్ నెలల్లో వచ్చే ఖాళీల్లో మళ్ళీ నెల్లూరుకు అవకాశం రావొచ్చు, అప్పుడు ఛాన్స్ ఎవరికీ దక్కుతుం దోనన్న ఉత్కంఠ ఇప్పటినుండే నాయకులలో కనిపిస్తోంది. ఎవరికి తగ్గ స్థాయిలో వాళ్ళు తమ ప్రయత్నాలు చేసుకుంటూనే ఉన్నారు. ఈసారి ఎవరికి అవకాశం ఇవ్వాలో ముఖ్యమంత్రి మనసులో నిర్ణయం జరిగి పోయి వుంటుందని, అధికారికంగా ప్రక టించడం కోసం మాత్రమే వేచి చూడాలని పార్టీ కార్యకర్తలు అంటున్నారు.

మొత్తానికి చివరినిముషంలో తెలుగు దేశంలోనుండి వైసిపిలోకి వచ్చిన బల్లి దుర్గాప్రసాద్ భారీ మెజారిటీతో గెలిచి దురదృష్టవశాత్తు దివంగతులైనప్పటికి ఆయన కుటుంబానికి మాత్రం రాజ యోగం పట్టిందని ఆయన అభిమానులు సంబరం చేసుకుంటున్నారు. మాట నిల బెట్టుకున్న ముఖ్యమంత్రిని అభినందిస్తు న్నారు. 1984 జూన్ 7వ తారీఖున జన్మించిన కళ్యాణ్ చక్రవర్తి దుర్గాప్రసాద్ పెద్ద కుమారుడు. ఇంజనీరింగ్ పట్ట భద్రుడైన తరువాత రాజకీయాలలో తండ్రికి తోడుగా ఉండేవాడు. 2019 ఎన్నికలలో తన భార్య శ్వేతతో కలిసి తండ్రి విజయానికి కృషి చేశాడు.

## బి - ఫారాలు ఇచ్చిన సియం

మార్చి 4వతేదీ, గురువారం తాడే పల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యా లయంలో సియం జగన్మోహన్‌రెడ్డిని కలిసి కళ్యాణ్ బి-ఫారం అందుకున్నాడు. కళ్యాణ్‌తో పాటు శాసనమండలి అభ్యర్థు లుగా బరిలో దిగనున్న సి.రామచంద్రయ్య, చల్లా భగీరథ, ఇక్బల్, కరీమున్నీసా, దువ్వాడ శ్రీనివాసులుకు కూడా జగన్ బి-ఫారాలను అందించారు.



## మే తర్వాత మండలిలో మాదే బలం

**- సజ్జల రామకృష్ణారెడ్డి**

శాసనమండలి అభ్యర్థులుగా బరిలో దిగబోతున్న ఆరుగురు ముఖ్యమంత్రి నుండి బి-ఫారాలు అందుకున్న అనంతరం పార్టీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ మండలి అభ్యర్థుల ఎంపికలో అన్ని వర్గాలకు ముఖ్యమంత్రి సమాన ప్రాధాన్యతను కల్పిస్తున్నారని అన్నారు. మే తర్వాత మండలిలో తమ పార్టీదే బలం అని, టిడిపి చెత్త రాజకీయాలకు రాబోయే రోజుల్లో మండలిలో సైతం చరమగీతం పాడతామని చెప్పారు. మంద బలంతో మండలిలో ఇంతకాలం టిడిపి వ్యవహ రించిన తీరును ప్రజలు గమనించారని అన్నారు.

### యస్.పి.బాలు స్మృత్యంకంగా మార్చి 7న 'అనంత్ కళాంజలి'చే

# స్వర నీరాజనం

### ముఖ్యఅతిథిగా రానున్న యస్.పి.చరణ్



భారతీయ సినీ సంగీత సామ్రాజ్యాన్ని వదలి అకస్మాత్తుగా తనువు చాలించిన మహా గాయకులు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యాన్ని స్మరించు కుంటూ 'అనంత్ కళాంజలి' సారధ్యంలో స్వర నీరాజనం జరుగనుంది. 'పాడుతా తీయగా'లో తమ గాత్రం ద్వారా సంగీతప్రియులను అలరించిన గాయనీ గాయకులు, ఈ కార్యక్రమంలో బాలు పాడిన పాట లతో ఆయనకు నీరాజనాలు అర్పిస్తారని, సంస్థ వ్యవస్థాపకుడు అనంత్ చెప్పాడు.

మార్చి 7వతేదీ ఆదివారం సాయంత్రం 6గంటల నుండి నెల్లూరు టౌన్‌హాల్‌లో జరిగే ఈ స్వర నీరాజనంలో బాలు తనయుడు యస్.పి.చరణ్ ముఖ్యఅతిథిగా, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి, యస్.వి.బి.సి ఛైర్మెన్ సాయికృష్ణ యాచేంద్ర, విక్రమసింహపురి యూనివర్సిటీ రిజిస్ట్రార్ యల్. విజయకృష్ణారెడ్డి, 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, పిక్‌నిక్ ఐస్‌క్రీమ్స్ అధినేత వీరిశెట్టి హజరత్‌బాబు ఆత్మీయ అతిథులుగా పాల్గొం టారని అనంత్ ఒక ప్రకటనలో తెలిపాడు.

సంగీతప్రియులు, బాలు అభిమానులు, కళా రాధకులు నెల్లూరు పురప్రజలు ఈ స్వరార్చనలో పాల్గొని బాలుగారిని సంస్మరించుకోవలసిందిగా అనంత్ కోరాడు.


శ్రద్ధాంజలి



1933 2021

మా హితైషి, మా కుటుంబ శ్రేయోభిలాషి,
మా అభ్యున్నతి కోసం బంగారుబాటలు వేసిన
పెద్దలు, ఆప్తులు, ఆత్మీయులు, మా మేనమామ

**గునుపాటి హరిశ్చంద్రారెడ్డి గారి**

ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...
వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం.

**జక్కా కోదండరామిరెడ్డి**
**జక్కా శ్రీనివాసులురెడ్డి**
**జక్కా శివనారాయణరెడ్డి**

## 'ప్రభా'తం

# రసవత్తరంగా రాజకీయాలు

**అసలే కరోనా నివారణకు పరుగులు, మరోవైపు రైతుల ఆందోళనలు, పెరుగుతున్న పెట్రోలు ధరలు దేశాన్ని అతలాకుతలం చేస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో త్వరలోనే పలు రాష్ట్రాల్లో జరగనున్న ఎన్నికలు అధికార బిజెపికి పెద్ద పరీక్ష లాంటివే. బిజెపిని అన్ని పార్టీల కంటే అగ్రగామిగా ముందుకు నడిపిస్తున్న ప్రధాని మోడీ, అమిత్‌షాల రాజకీయవ్యూహాలు ఈ ఎన్నికల్లో ఏమేరకు సత్ఫలితాలనిచ్చి ఆ పార్టీ ప్రతిష్టను నిలబెడతాయో వేచి చూడాల్సిందే. అన్ని పార్టీలకు ఈ ఎన్నికలు కీలకం కావడంతో ఆయా రాష్ట్రాల్లో రాజకీయాలు రోజురోజుకూ రసవత్తరంగా ఎంతో ఉత్కంఠభరితంగా మారుతున్నాయి.**

తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అస్సాం, కేరళ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగడంతో ఆయా ప్రాంతాల్లో రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి. ఈ నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో జరగనున్న ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవలే (ఫిబ్రవరి 26)న ఎన్నికల షెడ్యూలు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో 824అసెంబ్లీ స్థానాల్లో దాదాపు 18.68కోట్ల మందికిపైగానే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మార్చి 27-ఏప్రిల్ 29 మధ్య వివిధ రాష్ట్రాల్లో, వివిధ దశల్లో జరిగే ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు మే 2వ తేదిన జరుగుతుందని ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో రాజకీయవర్గాలు, పార్టీల నాయకులు అందరూ ఎన్నికల్లో గెలుపు కోసం ఎవరి వ్యూహాలను వారు సిద్ధం చేసుకుంటున్నారు. అభ్యర్థుల వెతుకులాటలో గెలుపు ప్రాతిపదికగా నిర్ణయాలు తీసుకోవాలని అందరూ భావిస్తున్నారు. అందులోనూ ఈ ఎన్నికలు అన్ని పార్టీలకు ఎంతో ప్రతిష్టాత్మకం కావడంతో పార్టీలన్నీ ఎంతో ఉత్సాహంతో ఎన్నికల సంగ్రామానికి సమాయత్తమవుతున్నాయి. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి విషయం అటుంచితే, మిగిలిన నాలుగురాష్ట్రాల్లో విజయం ఎవరిని వరిస్తుందోనని రాజకీయవర్గాలతో పాటు పరిశీలకులు కూడా ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. ముఖ్యంగా దేశవ్యాప్తంగా ఇప్పుడు అందరి దృష్టి పశ్చిమబెంగాల్‌పైనే ఎక్కువగా ఉంది. బిజెపి ఈసారి ఎలాగైనాసరే బెంగాల్ కోటలో పాగా వేయాలని ఆరాటపడుతోంది. ప్రత్యర్థి పార్టీ అయిన తృణమూల్ కాంగ్రెస్‌ను చిత్తు చేయడానికి బిజెపి సన్నాహాలు ప్రారంభించింది. తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మమతాబెనర్జీ మాత్రం ఇప్పుడే కాదు.. తొలినుంచి బిజెపిపై యుద్ధం చేస్తూనే ఉన్నారు. అవకాశం వచ్చినప్పుడల్లా బిజెపిపై విసుర్లు విసురుతూనే ఉన్నారు. తాను బెంగాలీ బిడ్డనంటూ సెంటిమెంటు రాజకీయాలను నమ్ముకుని బిజెపికి ఎదురొడ్డి నిలుస్తున్నారామె. బిజెపి ఎంతగా రాజకీయాలు చేసినా బెంగాల్ ప్రజలు తనకే విజయం చేకూరుస్తారంటూ ఆమె ధీమాగా ఉన్నారు. గతంలో బెంగాల్‌ను ఏళ్ళతరబడి ఏలిన కమ్యూనిస్టులు చతికిలబడిపోయి కాలక్రమేణా నామమాత్రంగానే మిగిలిపోవడం అందరికీ తెలిసిందే. కాంగ్రెస్ పరిస్థితి కూడా దాదాపు అంతే. ఈ పరిస్థితుల్లో మమతాబెనర్జీ బిజెపిపై మరింత ఘాటుగా విమర్శనాస్త్రాలు సంధిస్తూ ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో జాతీయస్థాయి రాజకీయవర్గాల్లో కూడా ఈసారి బెంగాల్ ఎన్నికలు ఎలా ఉంటాయోననే ఉత్కంఠ పెరుగుతూ ఉంది. ఈ ఎన్నికల్లో కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌లు కూడా రంగంలో ఉండబోతున్నా, ఈ రెండు పార్టీలు ఒకరికొకరు మద్దతునిచ్చుకుంటూ ఇప్పుడు చెట్టపట్టాలేసుకుని తిరిగినా.. పోటీ అంతా ప్రధానమైన తృణమూల్-బిజెపిల మధ్యనే ఉంటాయన్నది సర్వవిదితం. గతంలో కంటే ఇటీవలి కాలంలో మరింత దూకుడుపెంచి పశ్చిమ బెంగాల్‌లో కొంతమేరకు పట్టు సాధించిన బిజెపి ఈసారి ఎన్నికల్లో పూర్తిస్థాయిలో తమ సత్తా నిరూపించుకొని బెంగాల్‌లో తృణమూల్‌కు చెక్ పెట్టాలని అన్ని ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ఇప్పటికే అనేకమంది నాయకులు తృణమూల్‌ను విడిచిపెట్టి బిజెపిలో చేరుతున్నప్పటికీ తన విజయానికేమీ ఢోకా లేదని, తన గెలుపు నల్లేరు మీద నడకేనన్న అపారనమ్మకంతో మమతమ్మ ధీటుగా ముందుకు దూసుకుపోతోంది. ప్రధానంగా ఈ రెండు పార్టీల పోటాపోటీ రాజకీయాలతో బెంగాల్ మరింత వేడెక్కుతోంది. చివరికి ప్రజల తీర్పు ఎలా ఉంటుందో, ఏ పార్టీకి విజయం లభిస్తుందో వేచి చూడాల్సిందే. అదేవిధంగా తమిళనాడులోనూ రాజకీయాలు ఇప్పుడిప్పుడు మరింత రంజుగా మారుతున్నాయి. జయలలిత, కరుణానిధి వంటి సీనియర్ నేతలు లేకపోవడంతో తమిళనాడు రాజకీయంగా సొమ్మసిల్లిపోయింది. జయలలిత మరణంతో అన్నాడిఎంకె చతికిలబడిపోయింది. అయినా ఈ పార్టీతోనే పొత్తు పెట్టుకుని తమిళనాడులో తమ పార్టీని గట్టెక్కించుకోవడానికి కసరత్తు చేస్తోంది బిజెపి. మరోవైపు కమలహాసన్ పార్టీ ప్రభావం, శశికళ వైఖరి ఎలా ఉంటుందో ఇంకా ఒక కొలిక్కి రాలేదు. తాజాగా చిన్నమ్మ శశికళ 'అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకె) నేతృత్వంలో నాలుగో కూటమి ఏర్పాటుకు కూడా సిద్ధం అవుతున్నట్లు సమాచారం. ఇప్పుడున్న అయోమయ రాజకీయాల్లో కరుణానిధి వారసుడు స్టాలిన్ డిఎంకెని నిలబెట్టుకునేందుకు చేస్తున్న ముమ్మర ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయో చూడాలి. ఇకపోతే కమ్యూనిస్టుల కంచుకోటగా ఉన్న కేరళలో ఈసారి ప్రజల తీర్పు ఎలా ఉంటుందో చెప్పలేం. కమ్యూనిస్టుల సారథ్యంలోని ఎల్‌డిఎఫ్, కాంగ్రెస్ నాయకత్వంలోని యుడిఎఫ్ పార్టీలు ఇక్కడ ప్రధానంగా పోటీలో ఉన్నా, ఒకసారి వీరిని, ఒకసారికి వారిని అక్కడి ప్రజలు అందలం ఎక్కిస్తున్నారే తప్ప రెండుసార్లు వరుసగా ఎవరినీ నెత్తిన పెట్టుకుంది లేదు. ఈసారి అదే ఆనవాయితీని కొనసాగిస్తారో లేదో తెలియదు. బిజెపి పరిస్థితి ఇక్కడ అంతంత మాత్రమే. అస్సాంలో బిజెపి-కాంగ్రెస్‌ల మధ్యే ప్రధాన పోరు. ఎప్పుడూ లోలోపలే కుమ్ములాటల్లో ఉన్న కాంగ్రెస్ ఆ పరిస్థితి నుంచి బయటపడి అధికారపార్టీగా ఉన్న బిజెపిని ఎలా ఎదుర్కోగలదో చూడాలి. అసలే కరోనా నివారణకు పరుగులు, మరోవైపు రైతుల ఆందోళనలు, పెరుగుతున్న పెట్రోలు ధరలు దేశాన్ని అతలాకుతలం చేస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ఎన్నికలు అధికార బిజెపికి పెద్ద పరీక్ష లాంటివే. బిజెపిని అన్ని పార్టీల కంటే అగ్రగామిగా ముందుకు నడిపిస్తున్న ప్రధాని మోడీ, అమిత్‌షాల రాజకీయ వ్యూహాలు ఈ ఎన్నికల్లో ఏమేరకు సత్ఫలితాలనిస్తాయో చూడాలి. ఈ ఎన్నికలు బీజేపీకే కాక అన్ని పార్టీలకు కీలకం కావడంతో ఆయా రాష్ట్రాల్లో రాజకీయాలు రోజురోజుకూ రసవత్తరంగా మారుతున్నాయి.

---




## ధర్మనిరతుడు.. ఆదర్శపురుషుడు

# శ్రీరామచంద్రుడు

### చెన్నై వేదవిజ్ఞానవేదిక సభలో అవధాని కోట రాజశేఖర్

శ్రీరామచంద్రుడు ధర్మనిరతుడు..మహాపురుషుడని, మానవులు తమ జీవితాలను ఎలా ధర్మబద్ధంగా సాగించాలో స్వయంగా ఆచరించి చూపిన ఆదర్శపురుషుడని ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ అన్నారు. గతనెల 28న చెన్నైలోని వేదవిజ్ఞానవేదిక, ఆంధ్ర సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా) సంయుక్తంగా నిర్వహించిన 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారావాహికలో భాగంగా ఆయన 'షోడశ గుణముల శ్రీరాముడు' అనే అంశంపై ఉపన్యసించి శ్రీరామచంద్రుని గుణగణాలను, ధర్మబద్ధమైన, ఆదర్శవంతమైన శ్రీరాముని జీవితాన్ని అందరికీ అర్థమయ్యేవిధంగా విశదీకరించారు. ఈ సందర్భంగా తాను రచించిన 'శ్రీ సీతారామ కల్యాణం' నుంచి కొన్ని పద్యాలను కూడా హృద్యంగా పఠించి అందరి కరతాళధ్వనులందుకున్నారు. పలువురు కవులు, ప్రముఖ పండితులు, సాహితీవేత్తలు, తెలుగు సాహిత్యాభిమానులు పాల్గొన్న ఈ సభలో వేదిక అధ్యక్ష కార్యదర్శులు జెకె రెడ్డి, కందనూరు మధు తదితరులు మాట్లాడుతూ తరతరాల తెలుగు కవితా వైభవాన్ని, తెలుగు సాహిత్య వైశిష్ట్యాన్ని అందరికీ తెలియజెప్పాలన్న లక్ష్యంతో దాదాపు పదకొండు సంవత్సరాలుగా ఈ సారస్వత సభలు నిర్వహిస్తున్నామని, ఇది 122వ కార్యక్రమమని తెలిపారు. అనంతరం వేదవిజ్ఞానవేదిక, 'ఆస్కా' కమిటీ సభ్యులు కెకె చౌదరి, కె.రంగారావు, నిర్వాహకులంతా కలసి అవధాని కోట రాజశేఖర్‌ను సత్కరించారు.

---

## జిల్లాకు మరో

# నలుగురు ఉన్నతాధికారులు

- **జేసీ(ఆసరా)గా బాపిరెడ్డి నియామకం**

రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన డెప్యూటి కలెక్టర్ల బదిలీలు, నియామకాల్లో భాగంగా జిల్లాకు నలుగురు ఉన్నతాధికారులను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్ ఇటీవల ఉత్తర్వులిచ్చారు. జాయిట్ కలెక్టర్ (ఆసరా)గా బాపిరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిగా చిన్న ఓబులేసు, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా రోజ్‌మండ్‌తో పాటు తెలుగుగంగ ప్రాజెక్టు స్పెషల్ డెప్యూటికలెక్టర్‌గా విజయకుమార్‌లు ఆ మేరకు నిర్దేశించిన కొత్త బాధ్యతలను చేపట్టనున్నారు. జేసీ(ఆసరా)గా పనిచేస్తున్న కమలకుమారి పదవీ విరమణ చేసిన తర్వాత జేసీ(ఆసరా)గా రోజ్‌మండ్ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఇప్పుడు ఆ స్థానంలో బాపిరెడ్డి నియమితులయ్యారు. బాపిరెడ్డి ఇటీవల దాకా జిల్లాలో పలు శాఖల్లో ఉన్నతాధికారిగా పనిచేశారు. ఆత్మకూరు ఆర్డీఓగా, డ్వామా పీడీగా, నుడా వైస్‌ఛైర్మెన్‌గా, నెల్లూరు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్‌గా కూడా పనిచేసిన అనుభవం ఆయనకుంది. ఆ తర్వాత ఆయన ప్రకాశం జిల్లా జేసీగా ఇక్కడ నుంచి బదిలీ అయ్యారు. తాజా ఉత్తర్వులతో ఇప్పుడు జిల్లా జాయింట్ కలెక్టర్(ఆసరా)గా బాపిరెడ్డి తిరిగి ఈ జిల్లాలోనే నియమితులయ్యారు. ఇప్పటిదాకా జిల్లాలో ఇన్‌చార్జి జేసీ (ఆసరా)గా ఉన్న రోజ్‌మండ్‌ను నెల్లూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమించారు. వెలుగొండ ప్రాజెక్టు విభాగంలో పనిచేస్తున్న స్పెషల్ డెప్యూటి కలెక్టర్ విజయకుమార్‌ను నెల్లూరులోని తెలుగుగంగ స్పెషల్ డెప్యూటి కలెక్టర్‌గా బదిలీచేశారు. ఏపి హెల్త్ సర్వీసెస్ స్ట్రెంతనింగ్ ప్రాజెక్టు పీడీగా పనిచేస్తున్న చిన్న ఓబులేసును డిఆర్‌ఓగా నియమించారు. ఇప్పటిదాకా ఇన్‌చార్జి డిఆర్‌ఓగా పనిచేసిన నాగేశ్వర రావు తెలుగుగంగ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా రెగ్యులర్‌పోస్టులో కొనసాగనున్నారు.

## పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి జేడీగా వెంకటస్వామి

జిల్లా పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్‌గా డాక్టర్ వెంకటస్వామి నియమితులయ్యారు. ఇప్పటిదాకా జేడీగా ఉన్న డాక్టర్ విజయమోహన్ గతనెల 28న ఉద్యోగ విరమణ చేయడంతో, ఆ శాఖలో డెప్యూటి డైరెక్టర్‌గా పనిచేస్తున్న వెంకటస్వామిని ఇన్‌చార్జి జేడీగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు.

---

## ఎన్నేళ్ళు గడచినా కావలిలో

# పోలేరమ్మ గుడి అభివృద్ధి చెందడం లేదు




ఎక్కడెక్కడో చెరువుగట్టు మీదనో, కాలువగట్టు మీదనో వెలుస్తున్న దేవుడి విగ్రహాలు అభివృద్ధి చెందుతుంటే... కావలి పోలేరమ్మ గుడి అభివృద్ధి చెందడం లేదు. లతా థియేటర్ ఎదురగా వున్న పోలేరమ్మ గుడి చిన్న కుటీరం మాదిరిగానే వుంటున్నది. ఈ దేవాలయానికి వచ్చే భక్తులు అమ్మవారి దర్శనం చేసుకోవాలంటే ఇద్దరు మాత్రమే లోపలికి వెళ్లి బయటకు వస్తే కానీ మిగతా వాళ్లు లోపలికి వెళ్లడానికి వీలులేకుండా పోతోంది. అమ్మవారి దర్శనానికి వెళ్లే వారు కూడా తలవంచుకుని పోవాలి. లేకపోతే తలకు దెబ్బ తగులుతుంది. లోపలకు వెళ్లేవారు కూడా ఒకటి రెండు నిమిషాలు ఉండగలుగుతున్నారు. గుడిలోపల గాలి ఆడదు. గుడి గంట కూడా లోపలే పైభాగంలో కాకుండా కింది భాగంలో గోడకు ఆనుకుని ఉంటుంది. దసరాపండుగ, సంక్రాంతి పండుగ రోజులలో ఈ దేవాలయం వెలుపల అలంకరణ మాత్రమే బాగుంటుంది. ఇటీవల ఈ దేవాలయం వెలుపల ఆవరణాన్ని మాత్రమే శుభ్రం చేశారు.

ఒకప్పుడు ఒంగోలు దగ్గర వల్లూరమ్మ గట్టున మాత్రమే వెలసివున్నా, ఇపుడు పెద్ద దేవాలయంగా అభివృద్ధి చెందింది. పండుగ రోజులలో కానీ, వివాహ సమయాలలో కానీ భక్తులు ఇక్కడకు వచ్చి అమ్మవారి దర్శనం చేసుకుని, శుభకార్యాలు జరుపుకుంటారు. కానీ కావలి పోలేరమ్మ దేవాలయం మాత్రం ఎన్నేళ్లు గడచినా అభివృద్ధి చెందలేదు. ఎంతోమంది పెద్దలు పదవులలో ఉన్నా కూడా పట్టించుకోవడం లేదు. పెద్ద పదవులలో ఉన్న ఎవరైనా దేవాలయాన్ని అభివృద్ధి చేస్తే శాశ్వతంగా ప్రజలు వారి పేరు చెప్పుకుంటారు.

– ఎ.వి.ఎన్. ప్రవీణ్ చంద్రకుమార్, **కావలి.**

# నింగికెగసిన భారతీయ సంస్కృతి



*భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈసారి కనీవినీ ఎరుగని రీతిలో అంతరిక్షంలో మరో అద్భుతాన్ని ఆవిష్కరించింది. సాధారణంగా శాస్త్రవేత్తలు రాకెట్లతో పాటు శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనలకు ఉపగ్రహాలను పంపుతుంటారు. ఈసారి 'ఇస్రో' అలాంటి ఉపగ్రహాలతో పాటు భారతీయ సంస్కృతిని, భారత ఘనకీర్తిని అంతరిక్షంలో కూడా విజయవంతంగా చాటి తన ప్రత్యేకతను నిరూపించుకుంది. సాక్షాత్తూ భారతీయ సంస్కృతి వైభవానికి తార్కాణంగా నిలిచిన పరమపవిత్రమైన గ్రంథం 'భగవద్గీత'ను, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న భారత ప్రధాని నరేంద్రమోడీ ఫోటోను కూడా అంతరిక్షంలోకి పంపి ఇస్రో తన దేశం పట్ల, తన దేశ సంస్కృతి పట్ల తనకున్న గౌరవాన్ని చాటుకుంది. వీటితో పాటు దేశ రక్షణరంగానికి ఎంతగానో ఉపయోగపడే అద్వితీయమైన 'సింధునేత్ర' ఉపగ్రహాన్ని కూడా పిఎస్ఎల్వి సి 51 రాకెట్తో పాటు నింగిలోకి పంపింది. మొత్తంగా ఈ రాకెట్ ప్రయోగమంతా దిగ్విజయంగా జరిగి అంతరిక్ష రంగంలో భారత కీర్తిపతాక రెపరెపలాడింది.*



అందరూ ఊహించినట్లుగానే పిఎస్ఎల్వి–సి51 రాకెట్ సూపర్ సక్సెస్ అయింది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని షార్ సెంటర్లో ఉన్న మొదటి ప్రయోగవేదికపైనుంచి గతనెల 28న ఆదివారం ఉదయం సరిగ్గా 10 గంటలా 24 నిమిషాలకు పిఎస్ఎల్వి సి 51 నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకుపోయింది. ఇది బ్రెజిల్కు చెందిన అమెజానియా–1 ఉపగ్రహంతో పాటు అమెరికాకు చెందిన 13 మైక్రో ఉపగ్రహాలు, మనదేశానికి చెందిన 5 ఉపగ్రహాలను నింగిలోకి మోసుకువెళ్ళింది. 50 ఏళ్ళ ఇస్రో చరిత్రలో తొలిసారిగా దేశీయ ప్రైవేట్ సంస్థల ఉపగ్రహాలను నింగిలోకి తీసుకువెళ్ళడంతో ఇస్రో రాకెట్ ప్రయోగాల్లో తన సత్తా చాటుకుంది. ఇస్రో ప్రయోగించిన పిఎస్ఎల్వి సి 51 రాకెట్ మొత్తం 19 ఉపగ్రహాలను అలవోకగా నింగిలోకి మోసుకుపోయి అంచలంచెలుగా నిర్దేశిత కక్ష్యలో విడిచిపెట్టి ఇస్రోకి అద్భుత విజయాన్ని తెచ్చిపెట్టింది. గతనెల 28వ తేది ఉదయం సరిగ్గా ఉదయం 10 గంటలా 24 నిమిషాలకు పిఎస్ఎల్వి సి 51 రాకెట్ దిగ్విజయంగా నింగిలోకి దూసుకుపోయింది. అనుకున్న ప్రకారం గత ఆదివారం ఉదయం సరిగ్గా 10.24 గంటలకు పిఎస్ఎల్వి–సి51 రాకెట్ నింగిలోకి దూసుకుపోగా, 17.23 నిమిషాలకు అమెజానియా–1 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి విజయవంతంగా చేర్చింది. అక్కడి నుంచి ఒకటొకటిగా మిగిలిన ఉపగ్రహాలన్నీ విజయవంతంగా అంతరిక్షంలో నిర్దేశించిన కక్ష్యలోకి చేరడంతో శాస్త్రవేత్తలు ఆనందిస్తుండగా, రాకెట్ విజయం దృశ్యాలను టీవీలలో చూస్తున్నవారు కరతాళ ధ్వనులతో శాస్త్రవేత్తల కృషిని అభినందించారు. ఇస్రో ఛైర్మన్ డాక్టర్ కె.శివన్తో పాటు శాస్త్రవేత్తలందరూ ఈ అద్భుత ప్రయోగ విజయంతో దేశప్రజలందరి ఆత్మీయ అభినందనలు అందుకున్నారు.

## దిగ్విజయంగా నింగిలోకి :

శ్రీహరికోటలోని షార్ నుంచి జరిగిన ఈ ప్రయోగ దిగ్విజయం కావడం షార్ శాస్త్రవేత్తలతో పాటు దేశ ప్రజలందరికీ ఆనందం కలిగించింది. ఈ ఏడాది ఇస్రో తొలి రాకెట్ ప్రయోగం కూడా ఇదే. ఇది సూపర్ సక్సెస్ కావడంతో మరిన్ని ప్రయోగాలకు ఇస్రో సిద్ధం అవుతుంది కూడా. అందులోనూ ఇప్పుడు పంపిన రాకెట్ ఎంతో అద్వితీయమైనది. అది భారతీయ సంస్కృతిని నింగిలో రెపరెపలాడించిన రాకెట్గా చిరస్థాయి కీర్తిని సాధించడమే కాక, వాణిజ్యపరంగా మొట్టమొదటిసారిగా ఇస్రో చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతం కావడంతో దేశమంతటా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## ఉపగ్రహాలన్నీ నిర్దేశిత కక్ష్యలోకి :

పిఎస్ఎల్వి–సి51 రాకెట్ ద్వారా ఇస్రో అంతరిక్షంలోకి పంపిన ఉపగ్రహాల్లో ప్రధానంగా బ్రెజిల్కు చెందిన అమెజానియా–01 ఉపగ్రహం 637 కేజీల బరువు కలది. దీనిని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ స్పేస్ రీసెర్చ్ (ఐఎన్పిఇ)–బ్రెజిల్ వారు తయారుచేశారు. అమెజాన్ అడవులపై పరిశోధన, వ్యవసాయ సమాచారం కోసం వారు దీన్ని తయారుచేసుకున్నారు. మరో ఉపగ్రహం. స్పేస్ కిడ్స్ ఇండియా పేరుతో సతీష్ధవన్ శాట్ను పంపారు. వాతావరణ పరిశోధనకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. మూడవది యూనిటీ శాట్. ఇందులో మూడు యూనివర్శిటీలకు చెందిన మూడు ఉపగ్రహాలను పంపించారు. తమిళనాడు జెప్పియర్ ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన విద్యార్థులు జిట్శాట్ ఉపగ్రహాన్ని, కోయంబత్తూరులోని శ్రీశక్తి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు శ్రీశక్తి శాట్ను, మహారాష్ట్రలోని నాగపూర్ జిహెచ్ రాయ్సోని ఇంజనీరింగ్ కాలేజి విద్యార్థులు జిహెచ్ఆర్సిఇ శాట్ను పంపించారు. ఈ మూడు శాటిలైట్స్ రేడియోరిలే సర్వీస్ కోసం ప్రయోగించారు. ఇవి కాక, అమెరికాకు చెందిన స్పేస్ బీస్ పేరుతో 12 చిన్నతరహా ఉపగ్రహాలను, సాయ్–1 నానోకనెక్ట్–2 అనే ఉపగ్రహంతో పాటు మన దేశానికి చెందిన అత్యంత ప్రతిష్టాత్మకమైన 'సింధునేత్ర' ఉపగ్రహాన్ని పంపించారు.

## ఇస్రో విజయాల పరంపర:

పిఎస్ఎల్వి సీరీస్లో ఇప్పటిదాకా 53 రాకెట్ ప్రయోగాలు చేయగా అందులో కేవలం రెండు ప్రయోగాలు తప్ప మిగిలిన 51 ప్రయోగాలు విజయవంతం కావడం ఇస్రో శాస్త్రవేత్తల అనన్యసామాన్యమైన ప్రతిభకు నిదర్శనం. అందులోనూ ఈ ఏడాదిలో తొలి ప్రయోగం పిఎస్ఎల్వి–సి51 జయప్రదం కావడంతో ఈ విజయాల పరంపరలో అర్ధసెంచరీ దాటినట్లయింది. అందులోనూ ఈ రాకెట్తో పాటు 19 ఉపగ్రహాలను కక్ష్యలోకి విజయ వంతంగా పంపి ఇస్రో తన ఘనతను చాటుకుంది. 1993లో ప్రారంభమైన పిఎస్ఎల్వి–సి రాకెట్ల సీరీస్ మొదలైంది. రాకెట్ ప్రయోగాల్లో ఇస్రో నాటి నుంచి తన విజయపరంపరను చాటుతూనే ఉంది.

## ఎంతో కీలకమైనది 'సింధునేత్ర' :

పిఎస్ఎల్వి స–51 ద్వారా ప్రయోగించిన ఉపగ్రహాల్లో భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డిఆర్డిఓ) రూపొందించిన 'సింధునేత్ర' కూడా ఉంది. ఇదెంతో కీలకమైనది. ఇది హిందూ మహాసముద్ర ప్రాంతంలో సైనిక, వాణిజ్య, నేవీ నౌకల కార్యకలాపాలపై నిఘా పెడుతుంది. దేశ రక్షణ రంగానికి ఎంతగానో ఉపయోగపడే సింధునేత్ర కూడా దిగ్విజయంగా కక్ష్యలోకి చేరుకోవడం మన శాస్త్రవేత్తల ప్రతిభాపాటవాలకు నిదర్శనం.

## తొలి వాణిజ్య ప్రయోగం సక్సెస్ :

గతంలో భారత అంతరిక్ష శాఖ ఆధ్వర్యంలో యాంట్రిక్స్ కార్పొరేషన్ లిమిటెడ్ అనే సంస్థ విదేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుని ఆయా దేశాల ఉపగ్రహాలను ఇస్రో రాకెట్ల ద్వారా కక్ష్యలోకి పంపేది. అయితే ప్రధాని నరేంద్రమోడీ సూచనలతో కొత్తగా 'న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్'ను రూపొందించి విదేశాలతో పాటు భారత్లోనూ ప్రైవేట్ సంస్థలను అంతరిక్ష ప్రయోగాల్లో భాగస్వాములను చేయాలని నిర్ణయించారు. ఎన్ఎస్ఐఎల్ సంస్థ వాణిజ్య ఒప్పందాల మేరకు పిస్ఎల్వి–సి51 రాకెట్తో ఇస్రో ఎన్ఎస్ఐఎల్ తొలిసారిగా ఈ ప్రయోగాన్ని నిర్వహించి 14 విదేశీ, 5 స్వదేశీ ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపడం ఎంతో విశేషం. ఇది ఎన్ఎస్ఐఎల్ మొట్టమొదటి వాణిజ్య ప్రయోగం కావడం విశేషం.

## అంతరిక్షంలోకి భగవద్గీత, ప్రధాని మోడీ ఫోటో :

పిఎస్ఎల్వి సి 51 రాకెట్లో స్పేస్ కిడ్జ్ ఇండియా విద్యార్థులు రూపొందించిన సతీశ్ధవన్ శాట్ అనే బుల్లి ఉపగ్రహం ద్వారా గతంలో ఎవరూ ఊహించని విధంగా పవిత్రమైన భగవద్గీతతో పాటు మనదేశ ప్రధాని నరేంద్రమోడీ ఫోటోను కూడా పంపడం ప్రజలందరికీ ఎంతో ఆనందం కలిగించే విషయం. ఇది ఈ రాకెట్ ప్రయోగంలో విశిష్టమైన అంశంగా రూపొందింది కూడా. మరో పాతికవేల మంది పేర్లను కూడా ఈ ఉపగ్రహం ద్వారా అంతరిక్షంలోకి పంపడం ఈ ప్రయోగంలో ఒక ప్రత్యేకత. ఇలా ఈ ప్రయోగం భారతీయ సంస్కృతికి గర్వకారణంగా నిలుస్తూ ప్రజలందరి హృదయాలను ఆకట్టుకుంది.




# నెల్లూరు కబుర్లు

## రోడ్లపై చెత్త వేస్తే.. జరిమానా

**- నెల్లూరు నగర కమిషనర్ దినేష్‌కుమార్**



రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధిస్తామని నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. రోడ్ల పరిశుభ్రతకు, పారిశుద్ధ్యం పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈనెల 2న ఆయన కార్పొరేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్నామన్నారు. చెత్తకుండీలు లేకుండా ఎప్పటికప్పుడు చెత్తను పరిశుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈనెల 4 నుంచి నగరంలోని 16, 51 డివిజన్లను మోడల్ డివిజన్లుగా తీర్చి దిద్దేందుకు కృషిచేస్తున్నామని, మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో వీటిని ప్రారంభించనున్నామని, రానున్న కొద్దిరోజుల్లోనే మరో 10డివిజన్లను కూడా మోడల్ డివిజన్లుగా అభివృద్ధి చేస్తామన్నారు.

## యువతకు ఉపాధి కల్పించండి

**డిఆర్‌డిఏ పి.డి సాంబశివారెడ్డి**

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతకు ఉపాధి కల్పించే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని డిఆర్‌డిఏ పి.డి సాంబశివారెడ్డి సూచించారు. ఈనెల 2న ఆయన నెల్లూరులోని కలెక్టరేట్ ఆవరణంలో ఉన్న డిఆర్‌డిఏ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఏరియా కోఆర్డినేటర్లు, ఏపిఎంలతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు తగు శిక్షణ ఇవ్వాలని, వివిధ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషిచేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. పొదుపు సభ్యులకు బ్యాంక్ లింకేజి రుణాలును విరివిగా ఇప్పించేందుకు, తిరిగి వాటిని వారు సక్రమంగా చెల్లించేందుకు వారిలో అవగాహన కల్పించాలన్నారు. ఏపీడీ రాజు, డిపిఎం కామాక్షి, జేడిఎం జాబ్స్ హైమవతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### 23 నుంచి...

## శ్రీ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు



నెల్లూరులోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి బ్రహ్మోత్సవాలు మార్చి 23వ తేది నుంచి ఏప్రిల్ 2వ తేది వరకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతనెల 28వ తేది సోమవారం నాడు స్వామివారి బ్రహ్మోత్సవాలకు నాంది సూచకంగా ఆలయ ప్రాంగణంలో గుంజను ప్రతిష్టించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కోట గురుబ్రహ్మం, ఇ.ఓ డి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### అధునాతన పరిజ్ఞానంతోనే..

## రైతులకు మంచి లాభాలు

**- ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ యూనివర్శిటీ వైస్ చాన్సలర్**

అధునాతన పరిజ్ఞానం వినియోగించుకోవడం ద్వారా రైతులు వ్యవసాయరంగంలో మంచి లాభాలు పొందవచ్చని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆదాల విష్ణువర్ధన్ రెడ్డి చెప్పారు. ఈనెల 2న ఆయన నెల్లూరులోని వ్యవసాయ పరిశోధన స్థానంలో జరిగిన కిసాన్‌మేళాలో పాల్గొని మాట్లాడుతూ ప్రయోగశాల ల్లోని ఫలితాలను శాస్త్రవేత్తలు రైతులకు అందించాలని సూచించారు. రైతులు సాంకేతిక పద్ధతులను వినయోగించుకుని మరింత అభివృద్ధిని సాధించాలని, అందుకు శాస్త్రవేత్తల నుంచి సలహాలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని రైతుభరోసా కేంద్రాలకు పరిశోధనా స్థానాలను అనుసంధానం చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. వరిని పండించడంలోను, అక్వాసాగు లోనూ జిల్లా ముందడుగు వేస్తోందని, ఏడాదికి రాష్ట్రం సంపాదిస్తున్న 47 కోట్ల విదేశీమారకద్రవ్యంలో జిల్లాదే సగానికి పైగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ హరీందర ప్రసాద్, వ్యవసాయశాఖ జేడీ ఆనందకుమారి, పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

### కలెక్టర్ చక్రధర్‌బాబుకు

## సన్మానం

ఇటీవలే పిఎం కిసాన్ అవార్డును అందుకున్న జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబును ఈనెల 2న ఏపి రెవెన్యూ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు ఘనంగా సత్కరిచారు. ఈనెల 2న నెల్లూరులో ఈ కార్యక్రమం జరిగింది. ఆ సంఘం గౌరవాధ్యక్షుడు షఫీ మాలిక్, రాష్ట్ర నాయకులు సతీష్ కుమార్, గిరీష్, జిల్లా సంఘం అధ్యక్ష కార్యదర్శులు కృష్ణప్రసాద్, అశోక్‌కుమార్, అరుణ్‌కుమార్, తిరుపతి, నరేష్ తదితరులు పాల్గొని కలెక్టర్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

### బాలకార్మిక వ్యవస్థను

## నిర్మూలించాలి

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని, అందుకు అందరూ కృషిచేయాలని జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. నెల్లూరులో ఈనెల 2న ఆయన తన చాంబర్‌లో నిర్వహించిన టాస్క్‌ఫోర్స్ సమావేశంలో మాట్లాడారు. ముఖ్యంగా ప్రభుత్వ శాఖల్లో పనిచేసే వారంతా తమ బాధ్యతగా భావించి బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎస్పీ వెంకటరత్నంతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## టీచర్ల కొరత తీర్చాలి

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందని, దీంతో బోధన కుంటుపడుతుంది కనుక ప్రభుత్వం వెంటనే ఈ విషయం పరిశీలించి పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని బిటిఏ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ పేర్కొన్నారు. గతనెల 28న నెల్లూరులోని ఆ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన పలు పథకాలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య బాగా పెరిగిందని, దీంతో ఉపాధ్యాయుల కొరత కూడా ఏర్పడిందని తెలిపారు.

### పేద మహిళలకు

## కుట్టుమిషన్లు

లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గతనెల 28న నెల్లూరు నగరంలోని పలువురు పేద మహిళల జీవనోపాధికి కుట్టుమిషన్లు అందజేసి తన సేవాభావాన్ని చాటుకున్నారు. వాటితోపాటు ఆ పేదలకు బియ్యం, నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రామానుజం, జోనల్ ఛైర్మెన్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు శాస్త్రవేత్తలుగా రాణించాలి

**- డిఆర్‌డిఏ ఛైర్మెన్ సతీష్‌రెడ్డి**



విద్యార్థులు బాగా చదువుకుని శాస్త్ర వేత్తలుగా రాణించాలని డిఆర్‌డిఓ ఛైర్మెన్ సతీష్‌రెడ్డి ఆకాంక్షించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా గతనెల 28న ఆయన జిల్లా శాస్త్ర సాంకేతిక సహాయ మండలి ఆధ్వర్యంలో నెల్లూరులోని సాంఘిక సంక్షేమశాఖ విద్యార్థులకు సైన్స్‌లో అవగాహన కల్పించారు. సైన్స్‌తో దేశాభివృద్ధి ముడిపడి ఉందని, విద్యార్థులంతా సైన్స్‌పై మక్కువ పెంచుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జగదీష్, సాంకేతికశాస్త్రమండలి జిల్లా సమన్వయకర్త జేవి రమేష్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం



నెల్లూరు నగరంలోని మహేశ్వరి పరమేశ్వరి కల్యాణమండపంలో ఈనెల 1న చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభమైంది. చేనేత జౌళిశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ వస్త్ర ప్రదర్శనను జిల్లా జాయింట్ కలెక్టర్ హరేందిరప్రసాద్ ప్రారంభించారు. చేనేత వస్త్రాలు చేనేతకారుల కళా ప్రతిభకు నిదర్శనమన్నారు. చేనేతకారులకు అందరూ అండగా నిలవాలని, చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లా చేనేత జౌళిశాఖ అధికారి ఉమమహేశ్వరి మాట్లాడుతూ ఈనెల 1 నుంచి 14వతేది వరకు చేనేత వస్త్ర ప్రదర్శన ఉంటుందని, దేశంలోని అనేక రాష్ట్రాలకు చెందిన 50 చేనేత సంఘాలు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నాయని తెలిపారు.

## బ్యాడ్మింటన్‌లో సత్తా చాటిన నెల్లూరు చిన్నారులు

ఎంకె స్టాలిన్ జన్మదినోత్సవం సందర్భంగా ఇటీవల తమిళనాడులో నిర్వహించి అండర్-11 విభాగం సబ్ జూనియర్, జూనియర్-2021 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో నెల్లూరు క్రీడాకారులు సత్తాచాటారు. నెల్లూరుకు చెందిన టి.వర్షిత్ విన్నర్‌గా, టి.భరత్ సెమిఫైనలిస్ట్‌గా నిలిచారు. ఈ చిన్నారులను రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ ఈనెల 1న అభినందించి బ్యాడ్మింటన్‌లో మరింత ఉన్నత శిఖరాలను అందుకోవాలని వారిని ఆశీర్వదించారు.

## భక్తిశ్రద్ధలతో..శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం

నెల్లూరులోని ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గతనెల 28న రంగనాయకులపేటలోని ఆ సంఘం కల్యాణ మండపంలో సంఘానికి ఇటీవలే నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజల్లో మాజీ డెప్యూటి మేయర్ ముక్కాల ద్వారకనాథ్, రూప్‌కుమార్ యాదవ్, కప్పిర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. సంఘం నూతన కమిటీ అధ్యక్షుడు అమరా మోహన్‌రావు, కార్యదర్శి ఎంపి ఆంజనేయులు, కోశాధికారి కె.శోభన్‌బాబు పర్యవేక్షణలో ఈ పూజలు జరిగాయి.

## నరేంద్రబాబుకు సన్మానం



నెల్లూరులోని కెవిఆర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో 10వ (ఆంధ్ర) నావి కాదళ యూనిట్ ఎన్‌సిసి విభాగంలో అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్‌గా ఉన్న ప్రముఖ సాహితీవేత్త గుండాల నరేంద్ర బాబును ఇటీవల నెల్లూరులోని అచరిత్వ ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి 'మదర్ థెరిస్సా సేవా పురస్కారం-2021'ని బహుకరించి అందరూ అభినందించారు.

### పారిశుద్ధ్యంపై

## పర్యవేక్షణ

పారిశుద్ధ్య పరిరక్షణకు అధికారులు ప్రత్యేక దృష్టితో తగుచర్యలు చేపట్టాలని జిల్లా నోడల్ అధికారి వి.రామమనోహర్‌రావు అన్నారు. నెల్లూరు నగర పంచాయతీలోని పలు ప్రాంతాల్లో ఆయన ఈనెల 2న పర్యటించి పారిశుద్ధ్య పరిస్థితి ఎలా ఉందో పరిశీలించారు. తడి-పొడి చెత్తపై అధికారులకు ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పంచాయతీ కమిషనర్ శ్రీనివాసరావు తదితరులున్నారు.

### జేడీ సేవలు

## అభినందనీయం

పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ విజయమోహన్ సేవలు ఎంతైనా అభినందనీయమని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు కొనియాడారు. గతనెల 28న విజయమోహన్ ఉద్యోగ విరమణ సభలో కలెక్టర్ పాల్గొని జేడీ సేవలను గుర్తుచేసుకుంటూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చేయూత పథకం అమలులో జిల్లాకు మంచిపేరు తీసుకు వచ్చారని ప్రశంసించారు. అనంతరం జేడీ విజయమోహన్ దంపతులను కలెక్టర్ సన్మానించారు. ఇన్‌చార్జి జేడీ వెంకటస్వామిరెడ్డి, జడ్పీ సిఇఓ సుశీల, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ డెప్యూటి డైరెక్టర్లు నరసింహారావు, రమేష్, అధికారుల సంఘం అధ్యక్షుడు గురువారెడ్డి, పశు వైద్యుల సంఘం అధ్యక్షుడు మురళీ కృష్ణారెడ్డి, కార్యదర్శి సుబ్బానాయుడు, ఎస్సీఎస్టీ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

### సాగరమిత్ర పోస్టుల

## ఇంటర్వ్యూలు

ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకంలో భాగంగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన జిల్లాకు మంజూరైన 85 సాగరమిత్ర పోస్టుల భర్తీకి సంబంధించి అధికారులు ఈనెల 2న నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఆ పోస్టులకు ధరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను మత్స్యశాఖ అధికారులు పరిశీలించి ఇంటర్వ్యూలు చేశారు.

### గిరిజనశాఖ అధికారిగా

## కోటేశ్వరరావు

జిల్లా గిరిజన సంక్షేమశాఖ సూపరింటెండెంట్‌గా ఐటిడిఏలో మేనేజర్‌గా పనిచేస్తున్న కె.కోటేశ్వరరావును ఇన్‌చార్జిగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఇటీవల ఉత్తర్వులిచ్చారు. ఈ స్థానంలో ఇప్పటి దాకా పనిచేస్తున్న నవీన్‌కుమార్ ఉద్యోగ విరమణ చేయడంతో కోటేశ్వరరావును నియమించారు.

## నిబంధనలు పాటించాం..
# కరోనాను నివారించాం

ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి




కరోనా సమయంలో శ్రీసిటీ చుట్టుపక్కల కంటైన్మెంట్ జోన్లున్నా ప్రభుత్వాల నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించి పరిశ్రమల వారందరి సహకారంతో కరోనాను నివారించగలిగామని, తద్వారా శ్రీసిటీని కరోనా రహిత జోన్‌గా కొనసాగించగలిగామని శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి చెప్పారు. ఈనెల 1న ఆంధ్రప్రదేశ్ చాప్టర్ సిఐఐ వార్షిక సమావేశం విజయవాడ నోవోటెల్ హోటల్‌లో జరిగింది. ఈ ఆన్‌లైన్ సమావేశంలో ఆయన పాల్గొని 'కోవిడ్-19 ప్రభావం, శ్రీసిటీలో సాధారణ స్థితి చేరేందుకు స్వీకరించిన సవాళ్ళు' అనే అంశంపై ఆయన మాట్లాడుతూ కోవిడ్ నివారణకు శ్రీసిటీలో అమలుచేసిన వివిధ చర్యలను ఈ సందర్భంగా వివరించారు. శ్రీసిటీ ప్రాంతంలో భద్రత, సంక్షేమంపై దృష్టిసారించి వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు అన్ని రకాలుగా పెద్దఎత్తున తగు చర్యలు తీసుకున్నామని వివరించారు. కోవిడ్ సంక్షోభాన్ని అధిగమించి స్వయం సమృద్ధి సాధించడానికి శ్రీసిటీ ఆత్మనిర్భర్ భారత్ దిశగా ముందుకు సాగేందుకు కోవిడ్ తమకు కొత్త పాఠాలు నేర్పిందని, దాంతో సరికొత్త ప్రణాళికలను రూపొందించుకుని అనుసరిస్తున్నామని చెప్పారు. కోవిడ్ సమయంలో ఉద్యోగుల రాకపోకలపై ఆంక్షల దృష్ట్యా 'వాక్ టు వర్క్' అనే అంశంపై శ్రామికశక్తి కోసం నివాస సముదాయాలను రూపొందించేందుకు సిద్ధపడ్డామన్నారు.

తద్వారా కోవిడ్ వంటి క్లిష్టపరిస్థితులు భవిష్యత్తులో ఎదురైనా ఇక్కడి పరిశ్రమలు నిరాటంకంగా పనిచేసేందుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సిఐఐ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ డి.రామకృష్ణ సమావేశాన్ని స్వాగతించారు. సెయింట్ గోబైన్ ఇండియా ప్రై.లిమిటెడ్ ఛైర్మన్, ఎం.డి బి.సంతానం, సిఐఐ సదరన్ రీజియన్ డిప్యూటీ ఛైర్మన్ సికె రంగనాథన్, సిఐఐ ఆంధ్రప్రదేశ్ వైస్‌ఛైర్మన్ డి.టి తిరుపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో రవీంద్ర సన్నారెడ్డి ::

చిట్టమూరు మండలంలోని అరవపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1973-78 సంవత్సరాల్లో చదువుకున్న పూర్వవిద్యార్థులు ఈనెల 1న ఆ పాఠశాలలో సమావేశమై తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకుని ఆనందించారు. ఇక్కడ చదువుకున్న శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి కూడా పూర్వవిద్యార్థి కనుక ఆయన ఆధ్వర్యంలో ఈ సమ్మేళనం నిర్వహించారు. రవీంద్ర సన్నారెడ్డి కూడా తాను ఈ బడిలో చదువుకున్నప్పటి జ్ఞాపకాలను అందరితో ఆత్మీయంగా పంచుకున్నారు. ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ తాను అరవపాళెం ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అనంతరం తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను గౌరవిస్తూ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజయ్య, చంద్రారెడ్డి, రాజ్యలక్ష్మి, వేణుగోపాల్, శివరామయ్య, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

# 'నాడు-నేడు' చరిత్రాత్మకం

మంత్రి మేకపాటి గౌతంరెడ్డి



ప్రభుత్వ బడుల్లో చదువుకునే విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లోని వసతుల కంటే అత్యధికంగా ఆధునిక వసతులు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రప్రభుత్వం చేపట్టిన 'నాడు-నేడు' పథకం ఎంతో చరిత్రాత్మకమైనదని, జిల్లాలో ఈ పథకానికి సంబంధించిన పనుల పట్ల అధికారులు దృష్టి పెట్టాలని రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి చెప్పారు. గతనెల 28న ఆయన నెల్లూరులోని తన నివాసంలో ఏర్పాటుచేసిన అధికారుల సమావేశంలో 'నాడు-నేడు' పనులు ఎలా జరుగుతున్నాయో సమీక్షించారు.

దేశంలోనే తొలిసారిగా ప్రైవేట్ పాఠశాలలకంటే ఎక్కువగా ఆధునిక వసతులు ఏర్పాటుచేసి ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు రాష్ట్రం బంగారుబాటలు వేస్తోందని, ఎక్కడా లోపాలు లేకుండా చూడాలని చెప్పారు. ఈ పనులన్నిటినీ మార్చి నెలాఖరులోగా పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. కొన్ని బడుల్లో ఈ పనులు సరిగా జరగడం లేదని, పనులు సకాలంలో పూర్తికావడం లేదని తెలుస్తోందని, అధికారులు ఆ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు.

### ప్రతి మండలంలో 'మినీ స్పోర్ట్స్ క్లబ్':

జిల్లాలో క్రీడలను అభివృద్ధి చేసేందుకు ప్రతి మండలంలో ఒక మినీ స్పోర్ట్స్ క్లబ్ ఏర్పాటుచేయాలనే ఆలోచన ఉందని, ఇందుకు సంబంధించిన విధి విధానాలను, ప్రణాళికలను రూపొందించి నివేదిక ఇవ్వాలని మంత్రి ఈ సందర్భంగా పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎంఇఓ నజీర్‌బాషా, ఏఎస్‌పేట ఎంఇఓ జ్యోతి, చేజర్ల ఎంఇఓ కళాధర్, పంచాయతీరాజ్ ఏఓ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి
# బాధితులకు 13.7 లక్షలు మంజూరు

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు నియోజకవర్గం పరిధిలో పలురకాల వ్యాధులతో అవస్థలు పడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 13.77 లక్షల రూపాయలు మంజూరైందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ఈనెల 1న ఒక ప్రకటనలో తెలిపారు. విడవలూరు మండలంలోని ఆరుగురికి 3 లక్షలా 35 వేలు, కొడవలూరు మండలంలోని ముగ్గురికి 3 లక్షలా 3 వేలు, ఇందుకూరుపేటలో ఇద్దరికి లక్షా 65వేలు, బుచ్చిరెడ్డిపాళెంలో ఆరుగురికి 5లక్షలా 10వేలు, కోవూరు మండలంలో ఇద్దరికి 37వేల వంతున మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే ప్రసన్న తన కృతజ్ఞతలు తెలియజేశారు.



### ధాన్యం రైతులు నష్టపోకుండా చూడండి

రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యంలో తేమ శాతం తక్కువగా ఉన్నా, ప్రత్యామ్నాయ పద్ధతుల్లో వాటిని కొనుగోలు చేసి రైతులు నష్టపోకుండా చూడాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబును కోరారు. ఈనెల 2న ప్రసన్న నెల్లూరుకు వచ్చి కలెక్టర్‌ను కలిశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 17 శాతం తేమ ఉంటేనే ధాన్యం కొనుగోలుచేయాలని ఆదేశాలున్నాయని, అయితే రైతులు పంట కోసిన తరువాత ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు కల్లాల సౌకర్యం లేకపోవడంతో ధాన్యాన్ని అలాగే తీసుకువచ్చి విక్రయించి నష్టపోతున్నారని కలెక్టర్‌కు వివరించారు. ధాన్యంలో తేమ 18 శాతం ఉంటే క్వింటాకు ఒక కేజీ తరుగు, 19శాతం ఉంటే 2 కేజీలు, 20 శాతం ఉంటే 3 కేజీల వంతున తరుగు కింద ధాన్యాన్ని కొనుగోలు చేస్తే రైతులకు నష్టం ఉండదని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు. ఎఫ్‌సిఐ ద్వారా ఎంటియు 1010 రకానికి చెందిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే ప్రసన్న తెలిపారు. ఆయన వెంట డిసిసిబి ఛైర్మన్ దొడ్లరెడ్డి నిరంజన్‌బాబు రెడ్డి, వవ్వేరు బ్యాంక్ ఛైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డి తదితరులున్నారు.

# శ్రీసిటీకి.. మరో మెట్రో రైల్ కోచ్‌ల తయారీ సంస్థ

## 'సిఆర్ఆర్‌సి ఇండియా' పరిశ్రమకు భూమిపూజ

చైనాకు చెందిన మెట్రో కోచ్‌ల తయారీ కంపెనీ సిఆర్ఆర్‌సి అనుబంధ సంస్థ సిఆర్ఆర్‌సి ఇండియా నూతన పరిశ్రమకు బుధవారం శ్రీసిటీలో భూమిపూజ నిర్వహించారు. సిఆర్ఆర్‌సి ఇండియా డైరెక్టర్(ఆపరేషన్స్) హర్ష్ బాజపాయ్ సమక్షంలో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపిఐఐసి) వైస్‌ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.రవీన్‌కుమార్‌రెడ్డి భూమిపూజ చేసి ఫ్యాక్టరీ నిర్మాణాన్ని ప్రారంభించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, చెన్నై మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్(సిఎంఆర్ఎల్) అదనపు జనరల్ మేనేజర్ సతీష్ ప్రభు, సిఆర్ఆర్‌సి ఇండియా హెచ్ఆర్ మేనేజర్ ముఖేష్ గుప్తా ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీన్‌కుమార్‌రెడ్డి సిఆర్ఆర్‌సి బృందాన్ని అభినందిస్తూ, భారత్‌లో సిఆర్ఆర్‌సి మొట్టమొదటి యూనిట్ ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. శ్రీసిటీలో ఆల్స్టోమ్ మరియు సిఆర్ఆర్‌సి రెండు ప్రధాన మెట్రో కోచ్‌ల తయారీ యూనిట్లు ఉండడంతో, దేశంలో మెట్రోప్రాజెక్టుల అవసరాలలో 70 నుండి 80శాతం మన రాష్ట్రం సరఫరా చేయనుందన్నారు. శ్రీసిటి ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ఇది రెండవ భూమిపూజ కాగా, శ్రీసిటీలో ఇది 13వ చైనా కంపెనీ అన్నారు. ఆటోమోటివ్ రంగంలో మరో భారీ సంస్థ, ప్రపంచంలోనే అతిపెద్ద మెట్రో కోచ్‌ల తయారీ పరిశ్రమ శ్రీసిటీకి రావడం చాలా సంతోషంగా



ఉందన్నారు. సిఆర్ఆర్‌సి ఇండియా ఛైర్మన్ జెంగ్ యావో జెంగ్ వర్చువల్ మోడ్‌లో సభను ఉద్దేశించి మాట్లాడుతూ భారతదేశంలో చక్కటి ప్రణాళికతో ఏర్పాటైన అత్యుత్తమ పారిశ్రామిక కేంద్రాలలో శ్రీసిటీ ఒకటని, అందుకే తమ యూనిట్ ఏర్పాటుకు శ్రీసిటీని ఎంచుకోవడం జరిగిందన్నారు. సిఆర్ఆర్సి ఇండియా స్థానిక సామాజిక, ఆర్థిక అభివృద్ధికి దోహదపడే "ఫైవ్ లోకల్స్" మోడల్‌కు కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. శ్రీసిటీ డిటిజెడ్ ప్రాంతంలో 45.3 ఎకరాల స్థలంలో సుమారు రూ. 350 కోట్లు ప్రారంభ పెట్టుబడితో నిర్మిస్తున్న ఈ పరిశ్రమ ఈ సంవత్సరాంతానికి ఉత్పత్తులు ప్రారంభించనుందని పేర్కొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



## ప్రైమరీ స్కూల్ అదనపు గదుల నిర్మాణానికి
# ఎస్.వి రత్నం చారిటబుల్ ట్రస్ట్ లక్ష విరాళం



గూడూరు ఇందిరానగర్‌లోని మున్సిపల్ ప్రాథమిక ప్రైమరీ పాఠశాల అదనపు గదుల నిర్మాణం కోసం కీ.శే॥ శ్రీకంఠి వెంకటసుబ్బయ్య-వెంకట సుబ్బమ్మ జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు శ్రీకంఠి రామ్మోహన్‌రావు - రాజ్యలక్ష్మీ ఎస్.వి రత్నం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా లక్ష రూపాయల విరాళాన్ని ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ ఓబులేసులకు అందజేశారు. ఈ సందర్భంగా దాత శ్రీకంఠి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఇందిరానగర్‌లోని మున్సిపల్ పాఠశాల అదనపు గదుల నిర్మాణం కోసం గతంలో లక్ష రూపాయలు విరాళంగా అందజేశామని, ప్రైమరీ స్కూల్‌లో అదనపు గదుల నిర్మాణం అవసరమని తెలియడంతో యస్.వి రత్నం ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా లక్ష రూపాయలు అందజేశామన్నారు. తమ ట్రస్ట్ ద్వారా సామాజిక సేవాకార్యక్రమాలే కాకుండా విద్య కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ ఓబులేసు మాట్లాడుతూ యస్.వి రత్నం ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా శ్రీకంఠి రామ్మోహన్ రావు కరోనా సమయంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేయడమే కాకుండా విద్య కోసం స్కూల్ గదుల నిర్మాణానికి గతంలో లక్ష రూపాయలు, ఇప్పుడు మరో లక్ష రూపాయలు అందజేసి పేద విద్యార్థుల భవిష్యత్ కోసం సహాయం చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాలరెడ్డి, బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షులు అనిమెళ్ళ శివకుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షులు రాఘవరెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు



# నిర్భయంగా ఓటెయ్యండి
**- డిఎస్పీ ఎం.రాజగోపాల్‌రెడ్డి**

గూడూరు డివిజన్‌లోని నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని గూడూరు డిఎస్పీ ఎం.రాజ గోపాల్‌రెడ్డి అన్నారు. ఈ నెల 2వ తేదీ ఆయన నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న నామినేషన్‌ల ఉపసంహరణ కార్యక్రమాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్‌ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల నియమాలను అనుసరించి ప్రచారంలో 5మందికి మించి పాల్గొనకూడదని, ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలో 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. 10వ తేదీ జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల బందోబస్తుకు ప్రత్యేక దళాలను రప్పిస్తున్నట్లు, ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. నాయుడుపేట సిఐ వేణు గోపాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.



## నాయుడుపేటలో
# టీడీపీ విజయం తథ్యం

నాయుడుపేట మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు వైసీపీ నాయకుల బెదిరింపులకు భయపడొద్దని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. విజయం మనదేనని... అధైర్యపడకుండా అభ్యర్థులు ఎన్నికల్లో ముందుకెళ్లాలని టీడీపీ నాయకులకు సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో వైసీపీ పాల్పడుతున్న దురాగతాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఆయన వెంట సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం, సీనియర్ టీడీపీ నాయకులు పనబాక కృష్ణయ్య, చెంచలబాబు యాదవ్, గూడూరు రఘునాథరెడ్డి, ఎస్.విజయ భాస్కర్‌రెడ్డి, శ్రీరామ్‌ప్రసాద్, పసల గంగాప్రసాద్, కందల కృష్ణారెడ్డి, అవధానం సుధీర్, విజయులునాయుడు, మైలారి శేఖర్ తదితరులు ఉన్నారు.

# ఇది... 'ప్రైవేట్ ప్రభుత్వం' - చింతా మోహన్



కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అనేక ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం చేయడం తగదని మాజీమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చింతా మోహన్ విమర్శించారు. ఈ నెల 3వ తేదీ గూడూరులోని ఒక ప్రైవేటు కాలేజీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేలమందికి ఉపాధి కల్పించే దుగ్గరాజుపట్నం పోర్ట్‌ని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మొదలుపెట్టగా తర్వాతి ప్రభుత్వాలు దానిని పట్టించుకోలేదన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్ పరం చేయడం తగదని వ్యాఖ్యానించారు.

## గ్రంథ సమీక్ష
# 'మాట' మంత్రాక్షరం.. వెలుగుతున్న దీపం

మనం సమస్యను సరిగ్గా అర్థం చేసుకొంటే పరిష్కారం దానినుంచే వస్తుందంటారు - ప్రముఖ తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి.

నింగి నుంచి నేలదాకా అల్లుకొన్న చీకట్లను ఒక మంచిమాటతో దూరం చేయవచ్చు. కోటికాంతులను కళ్ళల్లో దాచుకోనూవచ్చు. పచ్చదనాన్ని జన జీవన ప్రవంతిలో ప్రవహింప చేయవచ్చు. చదవదగ్గ కళ్ళుంటే 'మాట' ఓ మహాకావ్యం, దివ్యదృశ్యమూనూ. ఇంతటి మెరుపు, మహత్తు వున్న 'మాట' దీర్ఘకవితను అనేక అధ్యాయాలుగా విభజించి మాటకున్న దైవత్వాన్ని తన వాక్యాల అల్లిప్పల్లోంచి మనల్ని స్పర్శించి మనకందించిన చిన్ని నారాయణరావు రెండో ముద్రణగా వెలువరించిన విశిష్ట కావ్యం. వినూత్నమైన విషయాలను అనుభూతింప చేసిన కావ్యం ఇది.




రచన : చిన్ని నారాయణరావు
వెల : రూ. 150/- పేజీలు : 131
ప్రతులకు: చిన్ని నారాయణరావు
27-1-171, శ్రీనికేతనమ్,
చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డు, నెల్లూరు - 2.
సెల్: 94402 02942

నెల్లూరుకు చెందిన ఈ కవి Tax Consultantగా తన వృత్తిని నిర్వహిస్తూ సామాజిక స్ఫూర్తి కలిగిన ఎన్నో కవితా సంపుటాల్ని వెలువరించారు. సినీకవి స్వర్గీయ వెన్నెలకంటితో కలిసి నాగభైరవ సాహిత్య పురస్కారాన్ని స్థాపించి ఎందరో ప్రముఖుల్ని సత్కరించిన ఘనత వీరిది. ఒక స్వచ్ఛమైన ప్రపంచానికి 'మాట' ఆలంబన కావాలని, మాటకు జాతి, మతం, రంగూ, కులం లేకుండా విశ్వవ్యాప్తం చేయాలని ఆశిస్తూ రాసిన ఈ దీర్ఘ కవిత కవి హృదయంలోంచి వెల్లువై పారింది. ఇదే దీర్ఘకవితలో మాట ఔన్నత్యాన్ని చెప్పేందుకు మాత్రమే ప్రయత్నం చేశానని వినయంగా చెప్పుకొన్నారు. ఇది పూర్తి వాస్తవం.

ప్రజాసమస్యలు శతానీకం ఉండగా కవులకు నేల విడిచిన సాము అక్కర్లేదని విశ్వసించే వాళ్ళలో నేనూ వొకణ్ణి అని ఆ హవిస్సులోనే ఈ కావ్యానికి శ్రీకారం చుట్టానని చెప్పుకొన్నారు. 'మాట' ఆయన లోపలి కవికి కర్తవ్య గీతను గుర్తు చేస్తూ ముందుకు సాగింది. ఇందులోని పంక్తుల్ని ఉదహరిస్తూ కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి గ్రహీత ప్రముఖ కవి శివారెడ్డి గారు 'మాట' కావ్యం ద్వారా నారాయణరావు సాహిత్య ప్రతిష్టను సాధించాడని, ఇలాంటి కావ్యం సాహిత్య చరిత్రలో ఇంతవరకూ రాలేదని, ఇదే ప్రథమమని, ఇది అన్ని భాషల్లోకి తర్జుమా కావాల్సిన అవసరం ఉందని ప్రశంసించారు. అలాగే స్వర్గీయ పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు, స్వర్గీయ అద్దేపల్లి లాంటి మేధావులు మాట మహత్తును గుండెల్లోకి దింపిన కావ్యమని ప్రశంసించారు. వాక్యం భుజాలపై చేతులేసి 'మాట' మహత్తును మెత్తటి చప్పుళ్లతో గుండెల్లోకి దింపిన కావ్యమని ప్రస్తుతించటం హర్షణీయం. వొక్కొక్క అధ్యాయానికి సాంఘిక సమస్యను జోడించి అర్థసౌకర్యం కోసం క్లుప్తతను పాటించి సామెతల్ని నానుడిల్ని విరివిగా వాడుకొన్నారు కవి. ఇది మాట మీద ఆయనకున్న ఆధిక్యతను తెలియచేస్తుంది. ఈ కావ్యం ప్రశస్త మేధావుల దృష్టిని ఆకర్షించి రెండో ముద్రణగా మీముందు కొచ్చింది. మూర్తీభవించిన పసితనంలా కనబడే కవి నారాయణరావు చేతులు కట్టుకొని విరాట్ స్వరూపాన్ని చూపించిన పుస్తకం 'మాట'. ఈ పుస్తకాన్ని సర్వాంగసుందరంగా వెలుగులోకి తేవడంలో మల్లెతీగ కలిమిశ్రీ కృషి అభినందనీయం.

పదిలపరచుకొన్న మరిన్ని 'మాట' మీద కవితల్ని ఇందులో పొందుపరచటం సంతోషదాయకం. నారాయణరావు మరిన్ని మంచి రచనలు చేయాలని ఆశిస్తూ, మాటకు చూపులు తగిలించి మరీ చదవాలని కోరుకుంటూ కవిని అభినందిస్తూ...



సమీక్ష : ఏటూరి నాగేంద్రరావు
7416665323

## మాతృమూర్తి వర్ధంతి నాడు
# రియాజ్ అహ్మద్ సేవా కార్యక్రమాలు




గూడూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ పాస్ట్ రీజియన్ ఛైర్మెన్ యస్.కె.రియాజ్‌అహ్మద్ మాతృమూర్తి ఖాదరున్నీసా బేగం వర్ధంతి సందర్భంగా ఇటీవల చిల్లకూరులోని డానియల్ చిల్డ్రన్స్ హోమ్‌లోని అనాథ పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే, గూడూరు పట్టణానికి చెందిన దివ్యాంగునికి ట్రై సైకిల్ బహుకరించారు. ముఖ్యఅతిథిగా ఆర్‌డబ్ల్యుఎస్ ఇ.ఇ నాగజ్యోతి పాల్గొనగా క్లబ్ అధ్యక్షుడు యం.రూపేష్‌రెడ్డి, కార్యదర్శి ఎ.కళ్యాణ్‌సాయి, కోశాధికారి పి.వి.జగదీష్‌చంద్ర, డిస్ట్రిక్ట్ ఛైర్మెన్లు, రిటైర్డ్ ఎంప్లాయిస్ అధ్యక్షులు మహబూబ్‌బాషా, యస్.కె.సాదిక్, జి.మురళీ తదితరులు పాల్గొన్నారు

# ముగిసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు



గూడూరులోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 4వ తేదీ 'లక్ష తులసి పూజ', 'మహాపూర్ణాహుతి'లతో ముగిశాయి. ఈ నెల 1వ తేదీ హర్షవర్ధన హోమంతో ప్రారంభమైన ఈ బ్రహ్మోత్సవాలలో అదే రోజు శ్రీనివాస కళ్యాణం నిర్వహించారు. 2వ తేదీ 'మహ సుదర్శన హోమం', సాయంత్రం 'గరుడసేవ', 3వ తేదీ 'తిరుమంజన సేవ', రాత్రి 'డోలోత్సవం', 4వ తేదీ 'లక్ష తులసి పూజ - పూర్ణాహుతి' కార్యక్రమాలు నేత్రపర్వంగా జరిగాయి. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన 'అన్న సంతర్పణ' కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో బ్రహ్మోత్సవాలలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# ప్రతిఒక్కరూ కోవిడ్ టీకా వేయించుకోవాలి

**- జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు**



కరోనా వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కోవిడ్ టీకా వేయించుకోవాలని, జిల్లాను పూర్తిస్థాయిలో కోవిడ్ రహిత జిల్లాగా మార్చడానికి అందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు కోరారు. ఈనెల 1న ఆయన నెల్లూరు లోని పడారుపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించినప్పుడు విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటికే తొలి రెండు విడతల వ్యాక్సినేషన్ ప్రక్రియ 78 శాతం పూర్తయిందని, దాదాపు 40వేల మంది ఈ వ్యాక్సిన్ వేయించుకుని సురక్షితంగా ఉన్నారని తెలిపారు. తొలి, రెండు విడతల కోవిడ్ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో రాష్ట్రంలో నెల్లూరుజిల్లా రెండవ స్థానంలో ఉందని, ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల దాకా వ్యాక్సినేషన్ కేంద్రాలు ప్రజలంద రికీ అందుబాటులో ఉంటాయని, అందరూ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. 60 ఏళ్ళు పైబడిన వారందరికీ ఉచితంగా వ్యాక్సినేషన్ వేస్తారని, 45 ఏళ్ళకు పైబడి 59 ఏళ్ళ లోపు వయసు ఉండి, బిపి, షుగర్ ఇతర దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి కూడా 3వ విడతలో కోవిడ్ వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ఆరోగ్యసేతు, కోవిన్ యాప్‌ల ద్వారాగాని, లేదా 1075, 1077 టోల్‌ఫ్రీ నెంబర్ల ద్వారా గాని, లేదా దగ్గరలోని ఆరోగ్యకేంద్రాల ద్వారా లేదా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా గాని ప్రజలు తమ పేర్లను రిజిస్టర్ చేయించుకుని కోవిడ్ వ్యాక్సిన్ వేయించు కోవాలన్నారు. ఆదివారంతో పాటు ఇతర శెలవు రోజుల్లో కూడా కోవిడ్ వ్యాక్సిన్ కేంద్రాలు అందరికీ అందుబాటులోనే ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్ హెచ్‌ఓ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# 60 ఏళ్ళ వృద్ధులకు..'కంటి వెలుగు'

**- డాక్టర్ మంజులమ్మ**

జిల్లాలో జరుగుతున్న మూడోదశ కంటివెలుగులో భాగంగా 60ఏళ్ళ వయసున్న వృద్ధులకు 'కంటి వెలుగు' కార్యక్రమం నిర్వహించి వారికి కంటి సమస్యలను తీర్చేందుకు కృషిచేస్తున్నామని, ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అంధత్వ నివారణ అధికారి, ప్రముఖ కంటివైద్యురాలు డాక్టర్ మంజులమ్మ తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోని ఒక్కో మండలంలో ఈ కార్యక్రమం ప్రారంభించామని, పది మండలాల్లో 50వేల మందికి గాను 27వేల మందికి స్క్రీనింగ్ పరీక్షలు కూడా పూర్తయ్యాయని, వీరిలో 13,209 మందికి గాను 9512 మందికి కళ్ళద్దాలను పంపిణీ చేశామని, మిగిలిన వారికి కూడా త్వరలోనే పంపిణీచేస్తామని పేర్కొన్నారు. 3729 మందికి ఉచితంగా క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేయిస్తున్నామని, సచివాలయ సిబ్బంది సహకారంతో ఏఎన్ఎంలు గ్రామాల్లోని ఇంటింటికి వెళ్ళి వృద్ధులను తీసుకువచ్చి కంటిపరీక్షలు చేయించాలని ఆమె సూచించారు.

# కొండ బిట్రగుంట క్షేత్రానికి..కొత్త శోభ తెస్తాం

**ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి**



జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండ బిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వ రాలయం అభివృద్ధికి చర్యలు తీసుకుం టున్నారు. 10కోట్ల రూపాయల వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇటీవల ఆయన ఆలయ కమిటీతో కొండపై సమీక్ష నిర్వహించారు. కొండ దిగువన స్వామివారి కోనేరును పుణ్యపుష్కరిణిగా తీర్చిదిద్దేందుకు ఏడాది కిందటే పనులు మొదలైనా కోవిడ్ నేపథ్యంలో జాప్యం జరి గిందని, దాదాపు 7 కోట్ల రూపాయలతో ఈ కోనేరును అభివృద్ధి చేయనున్నామని పేర్కొన్నారు. కొండ దిగువన దక్షిణం పక్క కల్యాణకట్ట, తూర్పువైపు రాజగోపురం నిర్మిస్తామని, భక్తుల కోసం విశ్రాంతి భవ నాలు, వసతి భవనాలు, కల్యాణమండ పంతో పాటు స్వామివారికి కొత్త వాహన శాల కూడా నిర్మిస్తామన్నారు. ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చుట్టూ ప్రహరీ కట్టిస్తామని, ప్రతిరోజూ స్వామి వారికి తులసిమాలలతో పూజలు చేసేం దుకు తులసివనం కూడా ఏర్పాటు చేస్తా మని చెప్పారు. ఆలయంలో అభివృద్ధి పను లకు సంబంధించి తిరుమల తిరుపతి దేవ స్థానాల బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి, టిటిడి అధికారులతోను సంప్రదించి తగు సాయం కోరనున్నట్లు చెప్పారు. బిలకూట క్షేత్రంలో నూతన రథం, రథశాల నిర్మాణా లకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మో హన్‌రెడ్డి కోటి రూపాయల నిధులు మం జూరుచేశారని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. తనవంతుగా ఈ ఆలయం అభివృద్ధికి పాతిక లక్షల రూపాయలు విరాళాన్ని ఇస్తున్నట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ పేర్కొన్నారు. దీంతో పలువురు దాతలు కూడా ఆలయ అభివృద్ధికి పెద్ద మొత్తాల్లో విరాళాలిచ్చేందుకు ముందుకు వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి ఏఎంసి ఛైర్మెన్ మన్నెమాల సుకు మార్‌రెడ్డి, ఆలయ పాలకమండలి ఛైర్మెన్ శ్రీరామం మాల్యాద్రి, ఆఫ్కాఫ్ ఛైర్మెన్ కొండూరు అనిల్‌బాబు, తహశీల్దార్ బాల మురళి, ఆలయ ఇఒ రాధాకృష్ణతో పాటు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# పెన్షనర్లకు కోవిడ్ టీకా

జిల్లాలో ఈనెల నుంచి పెన్షనర్లకు, సాధారణ ప్రజలకు కోవిడ్ టీకా వేసేం దుకు చర్యలు తీసుకుంటున్నామని జేసీ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మొదట పెన్షనర్లకు వ్యాక్సిన్ వేస్తారు. ఆ తర్వాత 60 ఏళ్ళు నిండిన వృద్ధులకు వ్యాక్సిన్ వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ముత్తుకూరు లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశా లను జేసీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 'నాడు-నేడు' కార్యక్రమం కింద 1060 పాఠశా లల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి జరుగుతోందని చెప్పారు.

## కుస్తీ పోటీల్లో సత్తా చాటిన

# 'కోట' గురుకులం విద్యార్థులు

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో కోటలోని బిసి బాలుర గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు తమ సత్తాచాటుకుని అందరి ప్రశంసలు అందుకున్నారు. కర్నూలులో ఇటీవల రెండురోజులపాటు జరిగిన ఈ పోటీల్లో అండర్-15, అండర్-23 విభాగాల్లో నెల్లూరు జిల్లా ఓవరాల్ చాంపియన్‌గా నిలవడం విశేషం. ఈ పోటీల్లో 10వ తరగతి విద్యార్థి బి.సతీష్ 41 కేజీల గ్రీకో రోమన్ విభాగంలోను, జూనియర్ ఇంటర్ విద్యార్థి పృథ్వీరాజ్ 75 కేజీల విభాగంలోనూ బంగారు పతకాలు సాధించారు. మరో అయిదుగురు రజత పతకాలు సాధించి కుస్తీలో నెల్లూరుజిల్లా ప్రతిభను చాటారు. వీరు జాతీయస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతయ్య తెలిపారు.

# 8 మంది ఎస్ఐల బదిలీ

జిల్లాలో 8మంది ఎస్ఐలను బదిలీచేస్తూ ఎస్పీ భాస్కర్‌భూషణ్ ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. శ్రీహరికోట ఎస్ఐగా పనిచేస్తున్న మనోజ్‌కుమార్‌ను పెళ్ళకూరుకు, పెళ్ళకూరులో పనిచేస్తున్న రమ్యను శ్రీహరికోటకు, సిసిఎస్‌లో పనిచేస్తున్న శ్రీనివాసులురెడ్డిని తడకు, తడలో పనిచేస్తున్న వేణును సిసిఎస్‌కు, విఆర్‌లో ఉన్న శ్రీనివాసరావును వరికుంట పాడుకు, అక్కడున్న ఉమాశంకర్‌ను సిసిఎస్‌కు బదిలీ చేశారు. విఆర్‌లో ఉన్న ముత్యాల రావును మనుబోలుకు, అక్కడ పనిచేస్తున్న సూర్యప్రకాష్‌రెడ్డిని విఆర్‌కు బదిలీ చేశారు.

# 'కొమరిక'లో 500 ఏళ్ళ నాటి 'శ్రీ కుంబేశ్వరస్వామి దేవాలయం'

***శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ఎంతో ప్రాచీనమైన శైవ క్షేత్రాల్లో ఇందుకూరుపేట మండలం 'కొమరిక' గ్రామంలో ఉన్న మంగళాంబ సమేత శ్రీ కుంబేశ్వర దేవాలయం ఒకటి. ఇది ఎంతో పురాతనమైన, మహిమాన్వితమైన ఆలయం.***





మన దేవాలయాలు (37)

'కొమరిక' గ్రామం సముద్రతీరంలోని ఓ చిన్న పల్లె. చల్లని గాలులతో.. చక్కని ఆహ్లాదకరమైన సుప్రశాంతమైన పల్లె వాతావరణంలో ఇందుకూరుపేట మండలంలో ఉన్న చిన్న గ్రామమిది. అయినా ఆ పరమేశ్వరుని ప్రతిరూపంగా ఇక్కడ వెలసివున్న కుంబేశ్వరస్వామి ఆలయం ఎంతో గొప్పది. ఇక్కడ స్వామివారి ఆవిర్భావం.. మహిమల గురించి పలు ఆసక్తికర మైన విశేషాలు కూడా ఉన్నాయి.

**ఆలయ చరిత్ర :**

శివుడు ఆదిదేవుడుగా.. దేవాదిదేవుడు.. మహాదేవునిగా సుప్రసిద్ధం. శివుడాజ్ఞ లేకుండా చీమైనా కుట్టదన్నట్లుగా శివుని కృప లేకుండా ఏదీ జరగదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ సర్వమంతా వ్యాపించివుండేది పంచభూతాత్మకమైన, అనంతమైన ఆ పరమాత్మ స్వరూపమే. అందుకే, తన భక్తులను కరుణతో కటాక్షించేందుకు ఆ భక్తవరదుడు అన్ని చోట్ల వెలసివున్నాడు. అలా ఓ చిన్న పల్లెలో కూడా వెలసిన సదాశివుని నిలయమే.. ఈ కుంబేశ్వర ఆలయం. అందులోనూ స్వామివారు తన మహిమాన్వితశక్తికి నిదర్శనంగా మారేడు చెట్ల పొదల్లో ఒక చిన్న కుండలో స్వయంభువుగా వెలయడంతో స్వామివారికి 'కుంబేశ్వరుడు' అని పేరు వచ్చిందని పెద్దలు చెప్తుంటారు. ఇక్కడున్న శివలింగం ఎంతో అపురూపమైనది..అద్వితీయమైనది కూడా. చుట్టూ ఉన్న మారేడుచెట్ల నీడలో అలరారుతూ ఉండే ఈ శివలింగం ఎంతో మహిమాన్వితమైనదిగా ప్రసిద్ధి. ఈ శివలింగానికి భక్తులు స్వయంగా అభిషేక పూజలు చేసే అవకాశం కూడా ఉండడం విశేషం. చారిత్రికంగా చూసినా ఈ ఆలయానికి ఎంతో పురాతనమైన చరిత్ర ఉంది. ఎప్పుడో దాదాపు అయిదు వందల సంవత్సరాల క్రితం నాటి చోళరాజుల కాలంలో ఈ శివలింగం చుట్టూ అత్యద్భుతమైన రీతిలో ఆలయం నిర్మించారు. ఆలయమంతా శిల్పకళా శోభతో, శివలీలలను, మహిమలను చాటిచెప్పే రూపాలతో, అనేక దేవతామూర్తుల శిల్పాలతో నయనమనోహరంగా ఉంటుంది. ఆలయ ప్రాంగణంలోకి వస్తే చాలు ఆధ్యాత్మికత భక్తిభావనలు అందరిలోనూ పెల్లుబుకుతాయి. ఆలయంలోకి రావడంతోనే భక్తులు పరవశంతో 'ఓం నమ:శివాయ', 'శంభో హరహర..మహాదేవ' అంటూ పెద్దపెట్టున శివనామ స్మరణలు చేస్తుంటారు. అడుగడుగు దండాలతో ఆ పరమశివుని పూజించి భక్తులు తమ జీవితాలను పునీతం చేసుకుంటూ ఉంటారు. పురాతన కాలం నుంచి ఎంతోకాలంగా భక్తుల పూజలందుకున్న ఈ శివాలయం.. కాలక్రమంలో శిథిలావస్థకు చేరడంతో కొంతకాలం కిందట గ్రామస్తులు, భక్తులు, దాతలు అందరూ కలసి ఆలయాన్ని ఎంతో భక్తితో పునరుద్ధరించుకున్నారు. ఆలయ శిల్పాలు చెదిరిపోకుండా రంగులు వేసి, ఆలయాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దుకుని ఆ మహాదేవుని పట్ల తమకున్న భక్తిప్రపత్తులను చాటుకున్నారు.

**మారేడు చెట్ల నీడలో శివలింగం :**

పరమేశ్వరునికి ఎంతో ప్రీతిపాత్రమైన మారేడు చెట్ల నీడలో ఇక్కడ శివలింగం ఉండడం విశేషం. ఇక్కడ స్వామివారు స్వయంభువుగా ఆవిర్భవించడంతో సాక్షాత్తూ ఆ శంకరుడే ఇక్కడ కొలువై ఉన్నాడని భక్తులు పూజలు చేస్తుంటారు. రమణీయంగా ఉన్న ప్రకృతి సోయగాల మధ్య, పెద్దపెద్ద మారేడు వృక్షాల ఛాయల మధ్య స్వయంభువుడైన ఆ భవుడు భక్తాభీష్టప్రదాయకునిగా ఈ చిన్న గ్రామంలో కొలువుదీరి ఉం డడం ఆ గ్రామస్తుల పూర్వజన్మల పుణ్యఫలం. అన్ని రుతువు ల్లోనూ, అన్ని కాలాల్లోనూ ఇక్కడ మారేడుచెట్ల నీడ శివలింగంపై చల్లగా పడుతూనే ఉంటుంది కూడా. నిత్యం చుట్టుపక్కలున్న అనేక గ్రామాల నుంచి, సుదూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు ఇక్కడికి వచ్చి స్వయంగా ఆ శివలింగానికి అభిషేకాలు, పూజలు చేసి తరిస్తుంటారు. శ్రీ కుంబేశ్వరస్వామిని ఆరాధిస్తే ఎలాంటి కష్టాలైనా కడతేరిపోతాయని, ముఖ్యంగా నూతన దంపతులు ఈ శివలింగానికి అభిషేకం చేసి మొక్కులు మొక్కుకుంటే కోరికలు నెరవేరడమే కాక మంచి సంతానం ప్రాప్తిస్తుందని ప్రతీతి. ఇక్కడ కొలువై ఉన్న శ్రీ మంగళాంబదేవి అమ్మవారు కరుణామూర్తిగా, ఆపదలు గాచే తల్లిగా ప్రసిద్ధి. పరమశివునికి ఎంతో ప్రీతికరమైన కార్తీకమాసం, మహాశివరాత్రి వంటి పండుగ రోజుల్లో ఆలయం పెద్దసంఖ్యలో వచ్చే భక్తుల రాకపోకలతో, పెద్దపెట్టున మార్మోగే శివనామస్మరణలతో కళకళలాడుతూ ఉంటుంది.

# వందల కోట్లు హైదరాబాదుకి తరలిపోతున్నాయి

(మొదటి పేజి తరువాయి)

తమ నియోజకవర్గాలలో కంటే హైదరాబాదులోని స్టార్ హోటళ్లలోనే ఆంధ్రా లీడర్లు ఎక్కువగా కనిపిస్తుండడం ఇందుకు నిదర్శనం. హైదరాబాదులోని ఆవాస, ట్రైడెంట్, పార్క్ హయత్, ఐటిసి కోహినూర్ వంటి 5, 7నక్షత్రాల హోటళ్లలో మనవాళ్ళు మకాం వేసి జంట నగరాల పరిసర ప్రాంతాలలో రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులకు అనువైన ప్రాంతాల కోసం అన్వేషణ సాగిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో నవరత్నాల పథకాల అమలుతో పాటు, ప్రజల ఖాతాలలోకి నేరుగా డబ్బులు జమయ్యే కార్యక్రమాలే జరుగుతున్నాయని, తమ ఖాతాల్లోకి డబ్బులు రావాలంటే హైదరాబాదు రియల్ ఎస్టేట్ పథకమే శ్రేయస్కర మని నేతలు భావిస్తున్నట్లు సమాచారం. కాంట్రాక్టర్ల దగ్గరా, బిల్డర్ల దగ్గరా వసూళ్లు చేసుకుంటున్న అరాకొరా కమీషన్లను తీసుకెళ్లి హైదరాబాదులో పెట్టుబడిగా పెట్టుకుంటున్నారని నేతల అనుయాయులే చర్చించుకోవడం గమనార్హం. ఇప్పటికే గత ఆరునెలల కాలంలో 1000 కోట్లకుపైగా ఆంధ్రా పొలిటీషియన్ల డబ్బు తెలంగాణాకు తరలిపోయిందంటున్నారు వ్యాపారవేత్తలు.

అగాదాంధ్రప్రదేశ్‌లో ఒక్క విశాఖపట్టణంలోనే కొంత ఆశాజనకమైన రియల్ బూమ్ కనపడుతోందని, కానీ అక్కడ కేవలం ముఖ్యమంత్రికి అంతరంగికంగా ఉన్న ఒకరిద్దరు మాత్రమే భారీస్థాయిలో లావాదేవీలు జరుపుతుండడంతో వేరే వాళ్లకి అవకాశం లేదని అంటున్నారు. అంతేకాకుండా బయట రాష్ట్రాలలో పెట్టుబడి పెడితే తమపై అధిష్టానం కన్ను పడదని కూడా ఈ నాయకులు భావించి తెలంగాణ వైపు మొగ్గు చూపిస్తున్నారని సమాచారం.

హైదరాబాదు అవుటర్ రింగు రోడ్డుకి అనుసంధానంగా రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి రావడం, గ్రేటర్ హైదరాబాదుని దేశ రెండవ రాజధానిగా చేసి, కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటిస్తారనే పుకారు షికారు చేస్తుండడంతో అక్కడ రియల్ వ్యాపారం పట్టపగ్గాలు లేకుండా పరుగులు పెడుతోంది.

నవ్యాంధ్ర యువ ముఖ్యమంత్రి కూడా రాష్ట్రాభివృద్ధిపై దృష్టిపెట్టి, మన రాష్ట్రాన్ని కూడా ప్రగతి వైపు పరుగులు పెట్టించకపోతే రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందని వైసిపి అభిమానులు, కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమ, ఒంగోలు, నెల్లూరు ప్రాంతాలలో కూడా అభివృద్ధి జరిగేలా ప్రణాళికలను రూపొందించాలని వాళ్ళు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంనుంచి సొంత పార్టీ నేతలే తరలిస్తున్న వందల కోట్ల రూపాయలపై నిఘా పెంచి, ఆ డబ్బు మన రాష్ట్రంలోనే ఉండేలా కూడా సీఎం జగన్మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టాలని ఆకాంక్షిస్తున్నారు.

# అభివృద్ధికి సహకరించండి

- వేమిరెడ్డిని కలిసిన నల్లపరెడ్డి



రాజ్యసభసభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఈనెల 3న నెల్లూరులోని ఆయన నివాసంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గౌరవపూర్వకంగా కలుసుకున్నారు. ప్రసన్నతో పాటు వవ్వేరు బ్యాంకు ఛైర్మెన్ సూరా శ్రీనివాసులురెడ్డి కూడా ఉన్నారు. పార్టీ పటిష్టత కోసం నిరంతరం శ్రమిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఈ సందర్భంగా ప్రసన్న అభినందించారు. కోవూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం సహాయసహకారాలు అందించవలసిందిగా వేమిరెడ్డికి విజ్ఞప్తి చేశారు.

# ఆడంబరంగా 'అనాధ పెళ్లి'



- ఆశీర్వదించిన విపిఆర్ దంపతులు
- వేదికైన వాత్సల్య

తన నాలుగేళ్ల వయస్సులో అమ్మా నాన్నలను కోల్పోయి ఆశ్రయం కోసం తన ఇద్దరు చెల్లెళ్ళతో వాత్సల్యకు చేరిన భవాని - శరవణన్‌ల కళ్యాణం మార్చి 3వ తేదీ ఆడంబరంగా జరిగింది.

తమిళనాడుకు చెందిన చిన్నారి భవాని పంతొమ్మిదేళ్ళ క్రితం తల్లితండ్రులను కోల్పోయింది. తనతో పాటు తన ఇద్దరు చెల్లెళ్ళని ఆమె సమీప బంధువులు జనహిత వాత్సల్య అనాధ శరణాలయానికి చేర్చారు. వాత్సల్య ఆ ముగ్గురిని పెంచి పెద్ద చేసింది. వారిలో పెద్దమ్మాయి ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చేసి ఉద్యోగం చేస్తోంది.

చిన్నప్పటినుండి భవాని ఆలనా పాలనా చూసిన వాత్సల్య బృందమే పెళ్లి పెద్దలుగా మారి ఇప్పుడా అమ్మాయికి పెళ్లి కూడా చేశారు. మార్చి 3వ తేదీ, బుధవారం, ఉదయం వాత్సల్య ప్రాంగణంలో జరిగిన ఆ పెళ్ళికి రాజ్యసభ సభ్యులు, వాత్సల్యకు శాశ్వత దాత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆయన సతీమణి, తిరుమల తిరుపతి దేవస్థానాల బోర్డు సభ్యురాలు శ్రీమతి ప్రశాంతిరెడ్డి హాజరయ్యారు. క్షణం తీరిక లేకుండా ఇటు వ్యాపార వ్యవహారాలు, అటు రాజకీయ కార్యకలాపాలతో తలమునకలై ఉన్న రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఈ వేడుక కోసం ప్రత్యేకంగా విచ్చేయడం ఆయన సహృదయతకు నిదర్శనం. ఈ వేడుకలో వాత్సల్యకు అండగా ఉంటున్న దాతలు, సంస్థ ప్రోత్సాహకులు 500మందికిపైగా పాల్గొన్నారు. సంస్థ సారధులు సామంతు గోపాలరెడ్డి, కార్యనిర్వాహకులు సాంబశివరావు, వాత్సల్య సిబ్బంది ఈ శుభ సంబరంలో పాల్గొని నవ దంపతులను ఆశీర్వదించారు. కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు, వాత్సల్య బృందానికి 'లాయర్' అభినందనలు.

# అదిరిందయ్యా చంద్రం!

ఈ వారం రోజుల వ్యవధిలో చంద్రబాబు నాయుడు గుర్తించవలసిన... గుర్తుపెట్టుకోక తప్పని... రెండు ముఖ్యమైన రాజకీయాంశాలు జనం దృష్టికి వచ్చాయి. రెండూ రెండు బాంబులే! వాటిని ఆయన మీదకు వదిలినవారు ఆయనకు రాజకీయ శత్రువులు కారు. ఆయనకు ఆత్మీయులు. పై పెచ్చు, జగన్‌కు బద్ధశత్రువులు.

ఒకరు... ఆంధ్రజ్యోతి ఎం.డీ- వేమూరి రాధాకృష్ణ. మొన్న ఫిబ్రవరి 28వతేదీ ఆదివారం నాడు, తన పత్రికలో 'కొత్త పలుకు' పేరిట రాసిన కథనంలో- మోడీకి చంద్రబాబునాయుడు భయపడుతున్నారంటూ ఒక నిఖార్సయిన రహస్యాన్ని బయట పెట్టారు. అది నిజమే అని రాజకీయ వర్గీయులు చాలామంది అనుకుంటున్నప్పటికీ, అది గుసగుసల స్థాయిలోనే ఉంది. ఇప్పుడు రాధాకృష్ణ దానిని కంఫర్మ్ చేశారు. మోడీ - ఈ దేశ ప్రధాని. కనుక, ముఖ్యమంత్రి జగన్-ప్రధానిని చూసి భయపడుతున్నారని ఆయన ప్రత్యర్థులు ఎద్దేవా చేయడాన్ని చివరకు- రాజకీయాల్లో ఉండేలు దెబ్బ ఇంకా రుచిచూడని లోకేష్ వంటివాళ్ళు కూడా వెటకారమాడడాన్ని మనం చూస్తూనే ఉన్నాం.



జగన్ మీద సీబీఐ కేసులున్నమాట నిజమే కదా! కాబట్టి, కేంద్రాన్ని చూసి జగన్ భయపడుతున్నారంటే - లాజికల్‌గానే ఉన్నట్టుగా మనం భావించవచ్చు.

కానీ, రాజకీయాల్లో ఒకటో రకం 'నిప్పు', 'ఎవరికీ భయపడని', ఈ తెలుగు వారికోసమే బతికే తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబునాయుడు - ప్రధాని మోడీని చూసి ఎందుకు భయపడుతున్నట్టు? ఆయనకు ప్రాణంలో ప్రాణం అయిన ఆంధ్రజ్యోతి ఎం.డీ రాధాకృష్ణ చెప్పిం తరువాత, ఇక దానికి అప్పీలేముంది? మరి, కేంద్రాన్ని మోడీని చూసి భయపడుతున్న చంద్రబాబునాయుడు - జగన్ ఏదో కొత్తగా కేంద్రాన్ని చూసి భయపడుతున్నాడంటూ విమర్శలు చేయడం ఏమిటో జనానికి అర్థం కావడం లేదు.




ఓకే. జగన్ కేంద్రాన్ని చూసి భయపడుతున్నారని అనుకుందాం. అందువల్ల రాష్ట్రానికి నష్టం జరుగుతున్నదని అనుకుందాం. మరి, చంద్రబాబు కేంద్రంపై తిరగబడి, రాష్ట్రానికి న్యాయం చేయవచ్చుగా! కేంద్రం వల్ల- రాష్ట్రానికి జరుగుతున్న నష్టాలు ఏమిటో ప్రజాకోర్టులో పెట్టి, కేంద్రాన్ని దోషిగా నిలబెట్టవచ్చుగా? జగన్ జనం కోసం గాక... తనకోసం బతుకుతున్నాడని అనుకుందాం. అందుకే, కేంద్రం ఎంత అన్యాయం చేసినా జగన్ నోరెత్తడం లేదని అనుకుందాం. మరి, చంద్రబాబు నాయుడు అలా కాదు కదా! 'నేను నిప్పు...నేను నిప్పు', '40 ఏళ్ళు... విలువలతో కూడిన రాజకీయం చేశాను' అంటూ ఆయనే ఓ వందసార్లైనా చెప్పి ఉంటారు. తాను తన కోసం గాక, ప్రజల కోసం బతుకుతున్నానని చెబుతున్న చంద్రబాబు నాయుడు- కేంద్రం ఎంత అన్యాయం చేసినా...ఎందుకు నోరెత్త లేకపోతున్నారు? తేలు కుట్టిన దొంగలా ఎందుకు మౌనంగా ఉంటున్నారు? ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ చెప్పినట్టుగా- తాను ఒక పక్క మోడీకి భయపడుతూనే, జగన్‌ను విమర్శించడంలో ఔచిత్యం గానీ, సహేతుకత గానీ ఉన్నదా?

రాధాకృష్ణే కాదు. చాలా మంది నమ్ముతున్నారు. అటు జగనూ భయపడి.. ఇటూ చంద్రబాబూ భయపడుతూ ఉంటే- జగన్‌ను ఓడించి.. చంద్రబాబును గెలిపించడం ఎందుకూ అనేది ఇక్కడ పాయింటు.

ఇక, రెండో విషయానికి వద్దాం. ఇది మొదటి దానికంటే కూడా పెద్ద బాంబు. చంద్రబాబుపై రాధాకృష్ణ చేయి చేసుకుంటే అందుకో మూడు, నాలుగు రోజుల ముందు కుప్పం టీడీపీ కార్యకర్తలు నోరు చేసుకున్నారు. చంద్రబాబు కుప్పం వెళ్లారు, గుర్తుంది కదా! అక్కడి కార్యకర్తలు- ఆయన మొహం మీదే చెప్పారు..' ఇహ మీ వల్ల కాదు గానీ, జూనియర్ ఎన్టీఆర్‌ను తీసుకురండీ' అని.

'జూనియర్ ఎన్టీఆర్‌ను తీసుకురండీ అన్నారంటే.. జగన్‌ను ఓడించడం మీ తండ్రీ కొడుకుల వల్ల కాదు స్వామీ...' అని చెప్పడం అన్న మాట.

రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశంపార్టీ వీరాభిమానుల్లోను, ముఖ్యంగా కమ్మ వర్గీయులలోను గూడుకట్టుకున్న బలమైన కోరిక ఇది. తెలుగుదేశం అనే ఆస్తికి నిజమైన వారసుడు - ఆనాటి ఎన్టీఆర్‌కు సమాజం గుర్తించిన మనవడు ఈ జూనియర్ ఎన్టీఆర్ మాత్రమే అన్న భావన జనం గుండెల్లో నాటుకు పోయి ఉండడం వల్ల కూడా- ఆమాట కుప్పం కార్యకర్తల నోటినుంచి తన్నుకొచ్చింది.

నిజానికి, నందమూరి తారక రాముడిగా తెలుగుజాతి నీరాజనాలు అందుకున్న ఆ యుగ పురుషుని గుండె లోతుల్లోనుంచి బయటకు పెల్లుబికిన భావనే-తెలుగుదేశం అనే పార్టీ.

'తెలుగుదేశం నాతో పుట్టింది. నాతోనే పోతుంది...' అని అంటూ ఎన్టీఆర్ అనేకసార్లు నిర్వేదానికి లోనయ్యారు. ఆయన వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లగలిగిన 'మగ' సంతానం లేకపోవడం వల్ల కూడా ఆయన అంతటి నిర్వేదానికి లోనై ఉంటారు. కానీ, కాంగ్రెస్ నాయకుడిగా తన మాన్యుఫలేటివ్ పాలిటిక్స్‌తో రాజకీయ రంగ ప్రవేశం చేసిన నారా చంద్రబాబు నాయుడు - తెలుగుదేశం పార్టీని కబ్జా చేసేశారు.

ఎన్టీఆర్ వారసులకు దక్కాల్సిన ఈ ఆస్తిని, తన వారసులకు కట్టబెట్టడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో పార్టీని, రాష్ట్రాన్ని కూడా ఫణంగా పెడుతున్నారు.

తెలుగుదేశం అభిమానులు సహనంతో భరిస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం రావాలి అంటే- ఎన్టీఆర్ అసలైన వారసుడు రంగంలోకి దిగాల్సిందేనన్న ఆ పార్టీ కార్యకర్తల మనోభావాలు క్రమక్రమంగా బయటపడడం ప్రారంభమైంది అనడానికి - ఓ బలమైన సూచనే... కుప్పం కార్యకర్తల డిమాండ్. లోకేష్- తెలుగుదేశంకు సహజ వారసుడు కాదు. కబ్జా ఆస్తికి వారసుడు కావాలనుకుంటున్న యువకుడు.

చంద్రబాబునాయుడు, ఆయన కుమారుడు లోకేష్‌తో తెలుగుదేశం కార్యకర్తలు, నేతలు చేస్తున్నది -గత్యంతరం లేని కాపురమే తప్ప ఇష్టపూర్వకమైనది కాదు అని టీడీపీ వీరాభిమానులు చెబుతూవుంటారు కూడా. చంద్రబాబు నాయుడుకు ఒంట్లో ఓపిక ఉన్నంతకాలమే... లోకేష్, ఆయన ఇన్నింగ్స్ ముగిసింతరువాత.... తెలుగుదేశంకు నెక్స్ట్ బ్యాట్స్‌మాన్- జూనియర్ ఎన్.టి.ఆరే. ఇవే-గత వారంలో -చంద్రబాబు నాయుడు గమనించాల్సిన రెండు పరిణామాలు.

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

# పెట్రో ధరలపై కాంగ్రెస్ భగ్గు భగ్గు!

- ఇందిరాభవన్ ఎదుట 'వంటావార్పు'తో నిరసన



రోజురోజుకు పెరుగుతున్న పెట్రోలు, గ్యాస్, నూనెల ధరలపై జిల్లా కాంగ్రెస్ మండిపడింది. కేంద్రప్రభుత్వం ఎక్సైజ్ పన్ను పెంచడంతో పెట్రోలు ధరలు పెరిగిపోయాయని, ప్రభుత్వ ఖజానా నింపేందుకు మోడీ ప్రభుత్వం ప్రజల జేబులకు చిల్లు పెడుతోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు కరోనాతో భయపడుతుంటే మన దేశంలో మాత్రం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు పెంచుతున్న ధరలతో ప్రజలు భయపడుతున్నారని విమర్శించారు. పెరుగుతున్న ధరల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ నెల్లూరులోని ఇందిరాభవన్ వద్ద కాంగ్రెస్ నాయకులంతా కలసి వంటా వార్పు నిర్వహించారు. అన్నం వండుకునేందుకు సామాన్య ప్రజలు వంట గ్యాస్ కూడా కొనలేని దుస్థితి ఏర్పడిందంటూ కట్టెలపొయ్యితో వంటలు చేశారు. ఈనెల 3న ఈ ఆందోళన జరిగింది. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ నిత్యం ధరలు పెరిగిపోతూ సామాన్య ప్రజలకు పెనుభారంగా మారుతున్నా కేంద్రప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని, అంబానీ, ఆదానీలకు లబ్ది చేకూర్చడానికి మోడీ ప్రయత్నిస్తున్నారే తప్ప ప్రజల బాధలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. పెట్రో ధరలు పెరగడంతో రవాణా ఖర్చులు పెరిగి, వాటి ప్రభావం సామాన్యులపై పడిందని, పేద మధ్యతరగతి ప్రజలకు అదనపు భారం పడుతోందని వారన్నారు. వెంటనే ధరలు తగ్గించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఆందోళనలో భాగంగా తొలుత నగరంలోని ఇందిరా భవన్ ఎదుట 'వంటావార్పు' చేశారు. ధరలు తగ్గించాలంటూ కార్యకర్తలు పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ ఆందోళనలో డిసిసి అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సివి శేషారెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఉడతా వెంకట్రావుయాదవ్, సిటీ ఇన్‌చార్జి షేక్ ఫయాజ్, రాష్ట్ర అధికారప్రతినిధి లేళ్ళపల్లి సురేష్‌బాబు, డిసిసి ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కొండా అనిల్‌కుమార్, మైనార్టీ అధ్యక్షుడు అల్లాఉద్దీన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పప్పర్తి గణేశ్‌బాబు, డిసిసి ప్రధాన కార్యదర్శి షేక్ హుస్సేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వాకర్స్ కొత్త కార్యవర్గం



నెల్లూరు నగరంలోని ఏ.సి. సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఈ నెల 3న జరిగింది. ప్రెసిడెంట్‌గా పలగాటి శ్రీనివాసులురెడ్డి, సెక్రటరీగా వినుకొండ వెంకటేశ్వర్లు, ట్రెజరర్‌గా మాగంటి ప్రసాద్, గౌరవాధ్యక్షులుగా నలుబోలు బలరామయ్య నాయుడు, గౌరవ సలహాదారులుగా జి.వి.కృష్ణయ్య, వీరిశెట్టి హజరత్‌బాబు, పి.సుబ్బారెడ్డి ఉపాధ్యక్షులుగా కొండూరు సుబ్బారావు, దొడ్ల జయరామనాయుడు, వి.లక్ష్మీనారాయణరెడ్డి ఎన్నికయ్యారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ఎలక్ట్ 2021 ప్రెసిడెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి, 203 జిల్లా గవర్నర్ యేకొల్లు రాఘవరెడ్డిలు ప్రమాణం చేయించారు. వాకర్స్ వేలూరు రంగారావు, డాక్టర్ కె.అంకిరెడ్డి, కొట్టె రామమూర్తి, శింగంశెట్టి మురళిమోహన్, ఎ.జయప్రకాష్, ఎం.భారతి, వి.సోను, పి.రమాదేవి, కిలారి మధుసూధనరావు, ఎల్.శ్రీనివాసులు, వి.వెంకటేశ్వర్లు తదితర వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

# మార్చి 15 నుంచి 'రెడ్‌క్రాస్' సైకిల్‌యాత్ర

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏర్పడి నూరేళ్ళు పూర్తయిన సందర్భంగా రెడ్‌క్రాస్ సేవలను విస్తృతం చేస్తూ రాష్ట్రంలో ఈనెల 15 నుంచి 25వతేది వరకు సైకిల్‌యాత్ర నిర్వహించనున్నట్లు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 3న ఈ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను నగరంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఆవిష్కరించారు. రాష్ట్రంలోని రెండు మార్గాల ద్వారా సైకిల్‌యాత్ర చేపట్టనున్నామని, కడప-కర్నూలు-చిత్తూరు, నెల్లూరు-ప్రకాశం-గుంటూరు జిల్లాల మీదుగా ఈనెల 25వ తేది నాటికి విజయవాడకు ఈ యాత్రలు చేరుకుంటాయని తెలిపారు. ఈ యాత్రలో రక్తదానంపై ప్రజలకు అవగాహన కలిగించడంతో పాటు పర్యావరణం పట్ల, మొక్కల పెంపకం పట్ల యువతలో చైతన్యం కలిగించేందుకు కృషిచేస్తామన్నారు. ఈ సైకిల్‌యాత్రలో పాల్గొనదలచినవారు 83099 66242 ఫోన్ నెంబరుకు సంప్రదించాలన్నారు. రెడ్‌క్రాస్ వైస్‌ఛైర్మెన్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, సభ్యులు గునుపాటి ప్రసాద్‌రెడ్డి, బయ్యాప్రసాద్, దాసరి రాజేంద్రప్రసాద్, ప్రసన్నాంజనేయులు, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వీక్షణం

- మంజీర

# జీహెచ్ రెడ్డి.. మహోన్నత వ్యక్తిత్వం



ప్రముఖుల్ని ప్రస్తావించేటప్పుడు 'పరిచయం అక్కరలేని వ్యక్తి' అని ప్రశంసాపూర్వకంగా చెప్పుకుంటాం. గునుపాటి హరిశ్చంద్రారెడ్డి గారిని తలుచుకునేటప్పుడు అనుకోవాల్సింది 'పరిచయం అక్కరలేని వ్యక్తి' అని కాదు. పరిచయం అక్కరలేని ఎందరో వ్యక్తులను తీర్చిదిద్దిన శిల్పి అని చెప్పుకోవాలి. కళ్ల ముందు కనిపించే శిల్పాన్ని మెచ్చుకుంటాం, కనిపించని శిల్పకారుడిని గౌరవిస్తాం. సినిమా దర్శకుడు తెర మీద కనిపించడు. కానీ మనోనేత్రంతో చూస్తే ప్రతి సీన్‌లోనూ దర్శకుడు కనిపిస్తాడు. అలాగ మన జిల్లాలోని ఎందరో సామాన్యులను ప్రముఖులుగా మలిచి సమాజానికి పరిచయం చేసిన దార్శనికుడాయన. అలాంటి గునుపాటి హరిశ్చంద్రారెడ్డి గారిని కలిసే అవకాశం నాకు కూడా వచ్చింది.

## మూడు గంటల మీటింగ్

పదేళ్ల కిందట ఓ రోజు జీహెచ్‌రెడ్డి గారి ఇంటర్వ్యూ కోసం గ్రీన్‌పార్క్ హోటల్‌కెళ్లాను. ఆయన మీడియాకు దూరంగా ఉంటారని తెలిసీ వెళ్లాను. అయితే ఆ రోజు ఇంటర్వ్యూ ప్రయత్నం వృథా ప్రయాసగానే మిగిలిందని గర్వంగానే చెప్పుకుంటాను. ఎందుకంటే... వార్తా పత్రిక ప్రతినిధిగా గునుపాటి హరిశ్చంద్రారెడ్డి గారిని కలవడమే ఆ రోజు నేను సాధించిన విజయం. ఆయనతో దాదాపు మూడుగంటల సేపు మాట్లాడగలిగాను. నేను మాట్లాడడంకంటే మా మీటింగ్‌లో ఎక్కువ సమయం ఆయన మాట్లాడుతుంటే వినడమే ప్రధానంగా సాగింది.

పెన్ను లోపల పెట్టండి!

ఆయన నాతో మాట్లాడిన మొదటి మాట "నేను పేపర్ల వాళ్లతో టీవీ వాళ్లతో కానీ మాట్లాడనని మీకు తెలియదేమో" అని.

"విన్నాను సర్, అయినా మీతో మాట్లాడాలని వచ్చాను" అన్నాను.

"అయితే మాట్లాడండి. నేను మాట్లాడేది వినండి. ముందు ఆ నోట్‌బుక్కు, పెన్ను బ్యాగ్‌లో పెట్టుకోండి" అన్నారు కచ్చితంగా.

అలాగేనని తలూపుతూ స్క్రిబ్లింగ్ ప్యాడ్, పెన్ను బ్యాగ్‌లో పెట్టేశాను.

"ఆ పత్రికలో ఎన్నాళ్ల నుంచి పని చేస్తున్నారు, పత్రికారంగంలో అనుభవం ఎంత"... వంటి ప్రశ్నలు అడుగుతూ మా ఊరు కూడా అడిగారు. 'మాది మైపాడు' అని చెప్పగానే "మా ఊరికి దగ్గరేగా, మీరు నెల్లూరుకు పోవాలంటే మా ఊరి మీద పోవాల్సిందే" అని "మీ నాన్న పేరేంటి" అన్నారు.

నేను బదులు చెప్పబోయే లోపు "మీ నాన్న కాదు తాత పేరు చెప్పు. నేను అక్కడి నుంచి వచ్చేసి చాలా ఏళ్లయింది. మీ తాత పేరయితే విని ఉంటానేమో" అన్నారు.

ఊరి పేరు చెప్పిన తర్వాత 'మీరు' అనడం మానేసి ఏకవచనంలోకి వచ్చేశారు. చాలా సంతోషంగా అనిపించింది. ఆయన నన్ను 'మీరు' అంటున్నంత సేపూ ఆవరించిన అసౌకర్యం 'నువ్వు'లోకి రావడంతో తొలగిపోయింది. మన నెల్లూరువాళ్లు ఎక్కడ ఉన్నా 'మీరు, గారు' వంటి గౌరవాలకంటే 'అమ్మా, నువ్వు, బాగుండా' వంటి మన మాటలతో అభిమానం-ఆత్మీయతలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు.

నేను మా తాత పేరు కాకుటూరు శేషారెడ్డి అని చెప్పిన తర్వాత ఆయన వాళ్ల నాన్న గారికి స్నేహితులని చెప్పారు. కుశలాల కబుర్లలో నుంచి ఆయన తాను జీవితాన్ని మొదలు పెట్టిన వైనాన్ని పూసగుచ్చారు. నెల్లూరులో పెళ్లి, ఆ తర్వాత భార్య శ్యామలమ్మతో కలిసి కొత్తూరుకు బస్సులో వెళ్లడంతో మొదలుపెట్టి తాను ఉద్యోగంలో చేరడం, పరిశ్రమ స్థాపించి ఉద్యోగాలు ఇవ్వగలిగిన దశకు చేరడం అన్నీ చెప్పారు. 'ఇప్పుడు మనం చూస్తున్న ఇదే సమాజం భవిష్యత్తులో ఎలా మారడానికి ఎలాంటి అవకాశం ఉందో ఆలోచన చేయగలిగితే, అప్పటికి అవసరమయ్యే రహదారికి వర్తమానంలోనే భూమి పూజ చేయవచ్చు' అని ఆయన మాటల్లో నాకు అవగతమైంది.

## పరుగు కష్టం అనిపించలేదు

జీహెచ్ రెడ్డి గారు తన ఎదుగుదలలో దాగిన విజయరహస్యం అంటూ ప్రత్యేకంగా ఏమీ లేదని, 'జీవితంలో నిలబడాలంటే కష్టపడాలని నమ్మాను. తగినంత శ్రమపడ్డాను' అని చెప్పారు. "గెలుపుకు అడ్డదారి ఉండదు, అందరూ ట్రాక్ మీద పరుగు తీయాల్సిందే. లైఫ్ కూడా అంతే. బతుకు పరుగులో బద్ధకంగా ఉండే వాళ్లు వెనకే ఉంటారు, ముందుండి తీరాలనే కసి ఉంటే పరుగు కష్టం అనిపించదు. పరుగు కష్టం అనుకునే వాళ్లు గెలుపును ఆశించకూడదు" అన్నారాయన. పెద్ద పెద్ద పదాలు వాడలేదాయన. ఆడంబరం లేని అలతి అలతి మాటల్లోనే గొప్ప కొటేషన్ చెప్పేశారు. కానీ ఆయన చెప్పిన మంచి మాట, ఆయన జీవిత గమనం, సోపానాలు, విజయాలు... ఏమీ ప్రచారంలోకి రాకూడదనే సూత్రాన్ని గట్టిగా పాటించారు. 'జీవితాన్ని బాగుచేసుకోవడం కోసం కష్టపడ్డాను. నా కోసం నేను పడిన శ్రమను గొప్పగా అనుకోవడం ఏమిటి? దాన్ని నేను చెప్పుకోవడం, మీరు రాయడం ఏమిటి?' అనేశారు. ఒక సూత్రాన్ని నమ్మడం వరకు అందరూ చేయగలుగుతారు, కానీ ఆ సూత్రాన్ని జీవితకాలమంతా ఆచరణలో పెట్టగలగడం కష్టం. తనకు తాను నిర్దేశించుకున్న నియమాన్ని విజయవంతంగా జయించేశారు జీహెచ్ రెడ్డిగారు. ఆయన జీవించి ఉన్న కాలంలో ఎక్కడ కూడా ఆయన పేరు ఎటువంటి ప్రసారమాధ్యమాల్లోనూ కనిపించలేదు, వినిపించలేదు.

## అలా పెంచారు

అప్పుడు నేను జీహెచ్‌రెడ్డిగారిని కలిసింది 'పిల్లల పెంపకం' శీర్షిక కోసం. సాధారణంగా ఏ తల్లిదండ్రులకైనా వాళ్లు తమ పిల్లల పెంపకంలో పాటించిన పేరెంటింగ్ రూల్ ఒకటి ఉంటుంది. దార్శనికుడైన వ్యక్తి పిల్లల్ని పెంచడంలో అనుసరించిన పేరెంటింగ్ రూల్ మా పాఠకులలో మరింత మందికి ఉపయోగపడుతుందనేది నా ఉద్దేశం. అందుకాయన "నేను ఎప్పుడూ పనిలోనే ఉంటాను. టైమ్ వృథాగా గడపడం ఉండదు. నేనే కాదు, నా వైఫ్ కూడా అంతే. పిల్లలు ఇంట్లో అమ్మానాన్నల్లో ఏం చూశారో అదే నేర్చుకుంటారు. మమ్మల్ని ఎలా చూశారో, ఆ ప్రభావమే వాళ్ల మీద కూడా ఉండి ఉంటుంది. నేను చెప్పి నేర్పించిందేమీ లేదు. మంచి-చెడుల విచక్షణ గురించి తల్లిగా వాళ్లమ్మ చెప్పి ఉంటుంది" అని అత్యంత సులువుగా చెప్పేశారు. బెల్ కొట్టి అటెండర్‌ని పిలిచి చాక్లెట్లు తెప్పించి నాకిస్తూ 'పిల్లలకివ్వు' అని చెప్పారు.

### ఎవర్ గ్రీన్

*గ్రీన్ పార్క్... ఇంటికి ఇలాంటి సునిశితమైన పేరు పెట్టుకోవడం ఆయనలోని సౌందర్య భావనకు అద్దం పడుతుంది. పరిశ్రమల రంగం నుంచి ఆతిథ్యరంగంలో అడుగుపెట్టిన తర్వాత కట్టిన హోటల్‌కి కూడా అదే పేరు పెట్టుకున్నారాయన. ఆయన కట్టిన హోటల్ హైదరాబాద్, అమీర్‌పేటలో ఉంది. ఆ దారిలో ప్రయాణించేటప్పుడు ఆయన గుర్తుకు వచ్చేవారు. ఇకపై కూడా గుర్తొస్తారు. కానీ కొంచెం బాధ బరువును కలుపుకుని గుర్తు చేసుకుంటుంది మనసు.*

## ఎన్నిసార్లు నిలబడతావు

మా సమావేశం పూర్తయిన తర్వాత ఇద్దరమూ ఆయన క్యాబిన్ నుంచి బయటకు వచ్చాం. ఆయన క్యాబిన్ దగ్గర రిసెప్షనిస్ట్ ఓ పాతికేళ్లమ్మాయి, ఆయనను చూసి లేచి నిలబడింది. "నేను ఎన్నిసార్లు అటూ ఇటూ తిరుగుతుంటానో నీకు తెలుసు కదా! ప్రతిసారీ లేచి నిలబడవద్దని చెప్పానా లేదా! నా మాట వినవా! నిలబడవద్దు, కూర్చుని పని చూసుకో' అని చనువుగా ఆత్మీయంగా చెప్పి ముందుకు నడిచారు. ఆయనలో ఒక టవరింగ్ పర్సనాలిటీని చూశాను. ఇన్నేళ్ల నా పాత్రికేయ జీవితంలో ఆ ముందు - తర్వాత వందల ఇంటర్వ్యూలు చేశాను. ఆ అందరిలో ఒకరు కాదాయన. ఆయన ఒకే ఒక్కడు. ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండడం వంటి పడికట్టు వాక్యాలేవీ ఆయనను చెప్పడానికి సరిపోవు. చదివిన ఎంత గొప్ప వాక్యమైనా సరే ఆయన్ని కొండను అద్దంలో చూపించే ప్రయత్నంగానే మిగులుతుంది.

● ఆత్మీయ వేడుక

# ఉషమ్మ 66వ పుట్టినరోజు



భారత ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడి సతీమణి, భారతదేశ ద్వితీయ పౌరురాలు శ్రీమతి ఉషమ్మ 66వ పుట్టినరోజు వేడుక ఈ నెల 2న మద్రాసులోని రెయిన్‌ట్రీ హోటల్‌లో ఆత్మీయ కుటుంబ సంబరంగా జరిగింది. ఉప రాష్ట్రపతి వెంకయ్యతో పాటు వారి కుమారుడు హర్ష, కుమార్తె దీప, అల్లుడు వెంకట్, మనుమరాలు సుష్మ, మనుమడు విష్ణు ఈ ఆనంద వేడుకలో పాల్గొని ఉషమ్మకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకయ్య తన సహధర్మచారిణికి శుభాకాంక్షలు తెలుపుతూ రాసిన అభినందన లేఖలో...

"అర్ధాంగి లక్ష్మీ ఉషమ్మా... నీ 66ఏళ్ళ జీవితంలో, నేటికి ఐదు పదులకు మించిన జీవితాన్ని నా కోసం, మన కుటుంబం కోసం వెచ్చించిన నీ ప్రేమ, సహనం, ఆదరం ఆప్యాయత, ఆవ్యాజానురాగం అనిర్వచనీయమైనవి" అని పేర్కొన్నారు.

స్నేహబాంధవి... ధర్మేచ, అర్థేచ, కామేచ, మోక్షేచ, నాతిచరామి! మన పెళ్లి నాడు ఈ ప్రమాణం చేశాము, అయిదు పదుల మన వివాహ బంధాన్ని గుర్తు చేసుకున్నప్పుడు అడుగడుగునా నీవు పాటించి, నాచేత పాటింపచేసిన ప్రతి అంశాన్ని ఈ శ్లోకం గుర్తుకు తెస్తుంది అన్నారు.

'శతమానం భవతి శతాయుః పురుషశ్శతేంద్రియ ఆయు ష్యేవేంద్రియే ప్రతితిష్ఠతి'.. అని అశీర్వదించారు. 'ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలి. నాతో కలిసి ఏడుడగులు నడిచిన నీవు, నా తోడు నీడగా ఏడేడు జన్మలూ నడవాలని ఆకాంక్షిస్తున్నాను.'.. ప్రేమాభినందనలతో...... అంటూ ఉటంకించారు.



## కోవిడ్ టీకా వేసుకున్న జెకె రెడ్డి, సామంతు గోపాల్‌రెడ్డి

మాజీ శాసనసభ్యులు, ప్రజా నేతగా పిలిపించుకుంటున్న జె.కె.రెడ్డి, నెల్లూరుజిల్లాలో ఆక్వా రంగానికి ఆదిగురువుగా పేర్కొనబడే సామంతు గోపాల్‌రెడ్డి మార్చి 4వ తేదీ గురువారం ఉదయం రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలో కోవిడ్ టీకా వేసుకున్నారు. వాక్సినేషన్ వేయించుకోవడం సామాజిక బాధ్యతగా భావించాలని, వాక్సినేషన్‌కి వయసు అడ్డం కాదని వీరిద్దరూ చెప్పారు.








# 20వ వర్ధంతి



పూజ్యులు

## స్వర్గీయ వేమిరెడ్డి శివకోటారెడ్డి గారు

నిర్యాణం: 06.03.2001

స్వర్గస్తులై 06.03.2021 నాటికి
**20 సంవత్సరాలు** నిండుతాయి.

**వారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...**

కుమారుడు:

**వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**
రాజ్యసభ సభ్యులు



Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com

05.03.2021, శుక్రవారం

లాయర్

మహా శివరాత్రి ప్రత్యేకం

## మహా శక్తివంతం... మహా మహిమాన్వితం

# ద్వాదశ జ్యోతిర్లింగాలు

శివుడు.. పవిత్రతకే పవిత్రమైనవాడు. శివుని పేరు ఉచ్ఛరించినా, పూజించినా మనస్సును శాంత పరుస్తుంది. పరమశివుడు దేవతలకే దేవుడు.. మహాదేవుడుగా కూడా అభివర్ణిస్తారు. అంటే సూర్యుడు, భూమి, నీరు, నింగి మరియు గాలి... సర్వం శివుడనే అర్థం. 'శ'కార, 'ఇ'కార, 'వ'కార.. సంయుక్తమే 'శివ' నామం. ఇందులో 'శ'కారం.. అద్వితీయ మైన పరమానందానికి, 'ఇ'కారం.. ఆ మహాదేవుడైన పరమేశ్వరునికి, 'వ'కారం.. అమృతశక్తి స్వరూపమైన ఆ పరాశక్తికి ప్రతీకలు.. అని పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. స్వయంజ్యోతి స్వరూపుడు, అద్వితీయుడు, అఖండ స్వరూపుడు, సచ్చిదానంద రూపుడు, సర్వవ్యాపకుడు, ప్రణవ స్వరూపుడు, త్రిగుణాతీతుడు, దేహాతీతుడు, ముక్త స్వరూపుడు, నిర్విశేషుడు, స్వయం ప్రకాశకుడు.. అన్నీ కూడా ఆ శివుడే. అందుకే సకల పాపాలను హరించేది, సర్వశుభాలను కలిగించేది.. అత్యంత శక్తివంతమైనది 'శివ'నామస్మరణ అని పురాణాలు పేర్కొంటున్నాయి.

### జ్యోతిర్లింగ స్తోత్రం

సౌరాష్ట్రే సోమనాథం చ..శ్రీశైలే మల్లికార్జునమ్
ఉజ్జయిన్యాం మహాకాళమ్..ఓంకారమమరేశ్వరమ్!
ప్రజ్వాల్యాం వైద్యనాథం చ..డాకిన్యాం భీమశంకరమ్
సేతుబంధే తు రామేశం..నాగేశం దారుకా వనే!
వారణాస్యాం తు విశ్వేశం, త్ర్యంబకం గౌతమీ తటే
హిమాలయే తు కేదారం, ఘృష్ణేశం చ శివాలయే!
ఏతాని జ్యోతిర్లింగాని సాయం ప్రాత: పఠేన్నర:
సప్త జన్మకృతం పాపం స్మరణేన వినశ్యతి!...

ఆ సచ్చిదానంద స్వరూపం..సదానంద స్వరూపమే శివుడు. అంతేకాదు, 'అనాద్యనంత శుద్ధం శివం శాంతం నిర్గుణం'..అంటుంది నిరాలంబోపనిషత్. ఆది అంతాలు లేని అనంతమైన, నిర్గుణ శాంత స్వరూపమే శివుడని, ఎవరిలోనైతే ఈ జగత్తంతా లయిస్తుందో ఆ దైవమే శివుడని ఉపనిషత్తులు సైతం ఉపదేశిస్తున్నాయి.

### 'హర హర మహాదేవ!..శంభో శంకర!..

శివ లింగంలోని రెండు బీజాక్షరాలు.. మంత్రాక్షరాలే. 'లిం' అంటే కంటికి కనిపించకుండా అవ్యక్తంగా ఉన్న దైవరూపం అని అర్థం. అలాంటి దైవరూపాన్ని వ్యక్తం చేసే చిహ్నం 'గం'. 'లీయతే ఇతి లింగ:'.. అంటే, సర్వం దేనిలో లయిస్తుందో అదే లింగమని అర్థం. 'ఆకాశం లింగ మిత్యాహు: పృథివీ తస్య పీఠికా'.. అన్నది పురాణ వచనం. అంటే, ఆకాశమే లింగంగా, భూమే వేదికగా బ్రహ్మాండాన్నంతా ఆవరించిన మహాశక్తిస్వరూపమే.. పరబ్రహ్మ స్వరూపుడు... మహాదేవుడైన ఆ మహాశివుడు.

### జ్యోతిర్లింగాల ఆవిర్భావం

పూర్వం మహాప్రళయం తరువాత, సృష్టి స్థితి కారకులైన బ్రహ్మ-విష్ణువుల మధ్య ఎవరు గొప్పో తేల్చుకోవాలని ఇరువురూ 'నేను గొప్పంటే.. నేనే గొప్ప' అని వాదన చేసుకున్నారు. ఆ వాదులాట కాస్తా సంగ్రామంగా మారింది. ఒకరిపై ఒకరు భీకర అస్త్రాలు ప్రయోగించుకునే సమయంలో ఆ యుద్ధాన్ని నివారించేందుకు ఆ పరమేశ్వరుడే స్వయంగా రంగంలోకి దిగి, ఒక పెద్ద జ్యోతిర్లింగంగా బ్రహ్మ-విష్ణువుల మధ్య ఆవిర్భవించాడు. ఆ సందర్భంలో ఓంకారనాదం మార్మోగింది. అందులోనూ అది ఒక పెద్ద జ్వాలాస్తంభం. సహస్రాధిక యోజనాల పొడవుగా ఉన్న ఆ అగ్నిస్తంభాన్ని చూసి బ్రహ్మ-విష్ణువులు ఆశ్చర్యపోయారు. అగ్నిజ్వాలలు విరజిమ్ముతున్న ఆ జ్యోతిర్లింగం తుది ఏదో.. మొదలేదో వారికి కనిపించలేదు. దీంతో ఆ జ్వాలాస్తంభం యొక్క ఆద్యంతాలు తెలుసుకున్న వారే మనలో అధికుడని వారు నిర్ణయించుకున్నారు. వెంటనే బ్రహ్మ హంస రూపం దాల్చి ఆ అగ్నిస్తంభం తుది భాగాన్ని కనుగొనేందుకు వెళ్ళగా, విష్ణువు ఆ స్తంభం ఆది(అడుగు భాగం) భాగాన్ని తెలుసుకోవాలని యజ్ఞ వరాహ రూపం ధరించి ఆ అగ్నిస్తంభం పక్కనుంచి భూమిని తొలుచుకుంటూ అడుగుభాగానికి వెళ్ళాడు. కానీ ఎంతగా శ్రమించినా వారిరువురి ప్రయత్నాలు ఫలించలేదు. ఆ జ్యోతిర్లింగం అడుగు భాగాన్ని కనుగొనడం తనకు సాధ్యం కాదని గ్రహించి విష్ణువు వెనుదిరిగి వచ్చి బ్రహ్మకోసం నిరీక్షించసాగాడు. బ్రహ్మ కూడా పైకి ఎన్ని యోజనాలు ప్రయాణించినా ఆ జ్యోతిర్లింగం తుదిని కనుక్కోలేక నిరాశ చెందాడు. బ్రహ్మ వెనుదిరిగి వస్తుండగా మధ్యలో ఆ లింగం నుంచి ఒక కేతక పుష్పం (మొగలిపువ్వు), ఒక ఆవు జారుతూ రావడం కనిపించింది. బ్రహ్మ వాటిని ఆపి, తనకు- విష్ణువుకు మధ్య జరిగిన వివాదం వివరించి తాను ఆ జ్యోతిర్లింగం అగ్రభాగాన్ని చూసినట్లుగా విష్ణువుతో నేను చెప్పేటప్పుడు అది నిజమేనని మీరు కూడా చెప్పమని అర్థించాడు. సాక్షాత్తూ సృష్టికర్తే తమని ప్రాధేయపడుతుండడంతో ఆ పుష్పం, ఆవు కాదనలేకపోయాయి. కిందికి దిగి వచ్చేసరికి విష్ణువు తాను ఆ లింగం మొదలును చూడలేకపోయానని చెప్తాడు. బ్రహ్మ తాను ఆ లింగం అగ్రభాగాన్ని చూశానని, కావాలంటే ఆవును, ఆ కేతక పుష్పాన్ని అడగమని చెప్తాడు. ఆ పుష్పం అవునని చెప్తుంది. ఆవు అసత్యం చెప్పడానికి ఇష్టం లేక తలతో 'అవునని', తోకతో 'కాదని' చెప్తుంది. బ్రహ్మదేవుడు ఇలా అసత్యం చెప్పడాన్ని సహించలేక ఈశ్వరుడు ప్రత్యక్షమై బ్రహ్మ అసత్యం చెప్పినందువల్ల భూలోకంలో ఎక్కడా పూజలందుకోవడానికి అర్హత లేకుండా శపించాడు. సత్యం చెప్పిన విష్ణువును ప్రజలంతా నిరంతరం పూజించేట్లు వరమిచ్చాడు. అప్పుడు విష్ణువు 'ఆద్యంతాలు లేని ఆ జ్వాలా లింగాన్ని అభిషేకించడం మాకు సాధ్యం కాదు. ఓ దేవాదిదేవా.. నీవు ఆ జ్వాలా రూపాన్ని ఉపసంహరించుకుని మా పూజలందుకోవడానికి తగు రీతిన అవతరించు' అని ప్రార్థించగా ఆ పరబ్రహ్మ తన జ్వాలారూపాన్ని ఉపసంహరించుకున్నాడు. మరుక్షణమే ఆ ప్రదేశంలో మొట్టమొదటగా శివలింగం అవతరించింది. అద్వితీయమైన ఆ లింగం నుండి వెలువడిన కిరణాలు తాకిన ప్రదేశాలు జ్యోతిర్లింగాలైనాయి.

*'జ్యోతిర్లింగం ఉదయం రుగ్వేదం గాను, మధ్యాహ్నం యజుర్వేదం, సాయంత్రం సామవేదం, రాత్రి అధర్వణ వేదంలా కనిపిస్తుంది.'*

మహాశివుడు జ్యోతిస్వరూపుడుగా ఆవిర్భవించడాన్ని 'లింగోద్భవమని', ఆ పుణ్యదినాన్ని 'శివరాత్రి' లేదా 'జ్ఞాన రాత్రి' అని అంటారు. శివలింగములో మూడు భాగాలు ఉంటాయి. బ్రహ్మ భాగము భూమిలో, విష్ణు భాగం పీఠంలో, శివ భాగం మనకు కనిపించే పూజా భాగంగా ఆగమ శాస్త్రాలు సూచిస్తున్నాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా లింగరూపుడు.. జ్యోతిస్వరూపుడైన ఆ మహాశివుడిని మనసారా స్మరించుకుందాం..





## 1. శ్రీ సోమనాథేశ్వరుడు

*సౌరాష్ట్ర దేశే విశదేతి రమ్యే, జ్యోతిర్మయం చంద్రకళావతంసమ్।*
*భక్తిప్రదానాయ కృపావతీర్ణం, తం సోమనాథం శరణం ప్రపద్యే॥*

సోమనాథేశ్వర క్షేత్రం గుజరాత్ రాష్ట్రంలోని సౌరాష్ట్ర జిల్లా, వెరావల్ రేవు(అరేబియా మహాసముద్ర తీరం) పట్టణానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది అతి ప్రాచీనమైనది. ఈ క్షేత్రాన్ని ప్రభాసతీర్థం అని కూడా అంటారు. మహాభారతంలో కూడా ప్రభాసతీర్థం వద్ద చంద్రుడు శివునికి పూజలు చేశాడనే ప్రస్తావన కూడా ఉంది. స్థలపురాణం ప్రకారం ఈ దేవాలయాన్ని చంద్రుడు నిర్మించాడని అంటారు. శాపవశాత్తు తన తేజస్సును కోల్పోయిన చంద్రుడు తపమాచరించి ఇక్కడే ఉన్న సరస్వతీనదిలో స్నానమాచరించి తిరిగి తేజస్సును పొందాడని, చంద్రుని కోరికమేరకు శివుడు ఇక్కడ స్వయంభువుగా వెలిశాడని స్థలపురాణం చెప్తోంది. దక్షుడి శాపం నుంచి చంద్రుడిని విముక్తిడిని చేసిన క్షేత్రం కనుక ఇది సోమనాథేశ్వరాలయంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడున్న చంద్రకుండంలో స్నానమాచరించి సోమనాథుణ్ణి దర్శించుకుంటే సర్వ పాపాలు తొలగిపోతాయి. ఈ క్షేత్రాన్ని దర్శించుకున్న శ్రీకృష్ణభగవానుడు తన లీలతో వెలిగించిన దీపం నేటికీ వెలుగుతూనే ఉండడం ఈ క్షేత్రం ప్రత్యేకత. ఈ పుణ్యక్షేత్రం శివభక్తులకు మాత్రమే కాక విష్ణుభక్తులకూ సందర్శనీయ క్షేత్రమే! శ్రీకృష్ణపరమాత్ముడు తన అవతారాన్ని ఇక్కడే చాలించినట్లు ప్రతీతి. శ్రీ సోమనాథుడు జ్యోతిర్లింగ స్వరూపంగా పార్వతీదేవి సమేతంగా వెలసి భక్తులను తన కరుణతో కటాక్షిస్తున్నాడు. ఈ ఆలయ గర్భగుడిలో శివలింగం నాలుగు అడుగుల ఎత్తుండి, 'ఓంకారం'తో అమర్చి ఉంటుంది. చారిత్రక ఆధారాల ద్వారా ఇక్కడ నిర్మించిన మొదటి ఆలయం 1వ శతాబ్దానికి చెందినట్లుగా తెలుస్తోంది.



## 2. శ్రీ మల్లికార్జునేశ్వరుడు

*శ్రీశైల శృంగే విబుధాతిసంగే తులాద్రితుంగే పి ముదావసంతమ్।*
*తమర్జునం మల్లికపూర్వమేకం నమామి సంసార సముద్రసేతుమ్॥*

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా, శ్రీశైలంలో పరమేశ్వరుడు తన సతి గౌరీదేవితో కలిసి స్వయంభువుగా శ్రీ భ్రమరాంబ సహిత మల్లికార్జునస్వామిగా వెలసివున్నాడు. శ్రీశైలానికే 'శ్రీగిరి', 'శ్రీపర్వత' మొదలైన నామాంతరాలు ఉన్నాయి. 'శ్రీ' అనగా సంపద, 'శైలము' అంటే పర్వతం, కనుక శ్రీశైలమంటే సంపద్వంతమైన పర్వతం అని అర్థం. భూప్రదక్షిణ ఎవరు ముందుచేస్తే వారికే గణాధిపత్యం అన్న మాట విని బయలుదేరిన షణ్ముఖునికి ప్రతిచోట వినాయకుడే ముందు కనిపిస్తాడు. పార్వతీపరమేశ్వరుల అనుగ్రహం వల్లనే అలా జరుగుతోందని నందీశ్వరుడు చెప్పడంతో, కుమారస్వామి అలిగి క్రౌంచపర్వతంపైకి వెళ్ళి కార్తీకునిగా వెలిశాడు. తన తప్పిదం వల్ల ఇలా జరిగిందని తెలుసుకున్న నందీశ్వరుడు శ్రీశైల శిఖరంలో తపస్సుచేయగా పార్వతీపరమేశ్వరులు భ్రమరాంబ సమేత మల్లికార్జునునిగా ఇక్కడ అవతరించి భక్తులను కటాక్షిస్తున్నారని ప్రతీతి. శ్రీరాముడు తన వనవాస సమయంలో ప్రతిష్టించిన వేయి లింగాలు మరియు పాండవులు వనవాస సమయంలో ప్రతిష్ఠించిన 5 లింగాలు ఇక్కడే కొలువుతీరినట్లు చెబుతారు. జగద్గురు ఆదిశంకరాచార్యులవారు ఎంతో ప్రసిద్ధి చెందిన 'శివానందలహరి'ని ఇక్కడే రాసినట్లు చెప్తుంటారు. ఇక్కడ గల మల్లెల్ల తీర్థం అనే జలపాతంలో స్నానమాచరిస్తే.. పాపాలు పోయి మోక్షం ప్రాప్తిస్తుందని పురాణాలు పేర్కొంటున్నాయి. కాశి క్షేత్రంలో మరణం, అరుణాచలంలో భగవన్నామస్మరణం, శ్రీశైలంలో శిఖర దర్శనం ముక్తిదాయకాలు. ఇక్కడ శిఖర దర్శనమైతే పునర్జన్మ ఉండదని ప్రతీతి. ఈ క్షేత్రం అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటి.



## 3. శ్రీ మహాకాళేశ్వరుడు

*అవంతికాయాం విహితావతారం, ముక్తిప్రదానాయ చ సజ్జనానామ్।*
*అకాల మృత్యోః పరిరక్షణార్థం, వందే మహాకాల మహాసురేశమ్॥*

మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని(అవంతి)లో క్షిప్రానది ఒడ్డున శ్రీ మహాకాళేశ్వరుని క్షేత్రం ఉంది. ఈ నగరంలో 7 సాగర తీర్థములు, 28 తీర్థములు, 84 సిద్ధ లింగములు, 30 శివ లింగములు, అష్టభైరవులు, ఏకాదశరుద్రులు, వందలాది దేవతా మందిరములు, జలకుండము ఉన్నాయి. మంత్రశక్తి వల్ల ఉద్భవించిన ఏకైక స్వయంభూ జ్యోతిర్లింగంగా ఇది ప్రసిద్ధి. ఇక్కడ తాంత్రిక మంత్రాలతో మహాకాళేశ్వరుని పూజిస్తుంటారు. పూర్వం వేదప్రియుడనే శివభక్తునికి దేవప్రియుడు, ప్రియమేథుడు, సుకృతుడు, ధర్మవాహి అనే నలుగురు కుమారులు ఉండేవారు. ఈ నలుగురూ శివభక్తులే. ఆ కాలంలో దూషణాసురుడనే రాక్షసుడు వీరి పూజలకు అవరోధం కలిగిస్తూ ప్రజలను హింసిస్తూ ఉండేవాడు. ఆ నలుగురు అన్నదమ్ములు పార్థివలింగాన్ని ప్రతిష్టించి పూజించగా శివుడు మహాకాళుడై అవతరించి ఆ దూషణాసురుని, రాక్షస సైన్యాన్నంతా భస్మం చేస్తాడు. అందుకు ప్రతీకగా ఇక్కడ నిత్యం ప్రాతఃకాలంలో మహాకాళేశ్వరునికి ఎంతో వైభవోపేతంగా 'భస్మాభిషేకం' చేస్తారు. ఈ దేవాలయంలోని మహాకాళేశ్వరుని విగ్రహాన్ని "దక్షిణామూర్తి" అని కూడా అంటారు. అనగా ఈవిగ్రహం ముఖం దక్షిణం వైపు ఉంటుంది. ఈ లక్షణం దేవాలయం తాంత్రిక శివనేత్రం యొక్క సంప్రదాయాన్ని సమర్థించే విధంగా ఉంది. ఉజ్జయినిలో సంవత్సరానికి ఒకసారి వర్షాకాలానికి ముందర 'పర్జన్యానుష్ఠానం' అని ఒక అనుష్ఠానం చేస్తారు. ఇది పూర్తి అవగానే ఆకాశంలో నల్లటి మబ్బులు పట్టి వర్షం కురుస్తుంది. మహాకాళేశ్వరుడు వెలిసిన ప్రాంతం కిందనే శంఖుయంత్రం అనే చాలా ఆశ్చర్యకరమైన యంత్రం ఉందని పెద్దలు నమ్ముతారు. అందుకని మహాకాళేశ్వరుడి దగ్గరకు వెళ్ళి దర్శనం చేసుకున్నవారు ఎటువంటి విజయాన్నయినా పొందుతారు.



## 4. శ్రీ ఓంకారేశ్వరుడు

*కావేరికా నర్మదయోః పవిత్రే, సమాగమే సజ్జన తారణాయ।*
*సదైవ మాంధాతృపురే వసంతమ్ ఓంకారమీశం శివమేకమీడే॥*

మధ్యప్రదేశ్‌లోని వింధ్యపర్వత ప్రాంతాల్లో, నర్మదా నదీతీరంలోని మామలేశ్వరంలో శ్రీ ఓంకారేశ్వర క్షేత్రం ఉంది. ఒకసారి వింధ్యుడు(వింధ్య పర్వతం) తన కంటే గొప్పవారెవరూ లేరని విర్రవీగుతుండగా నారదుడు వచ్చి నీకంటే మేరుపర్వతం గొప్పదని చెప్పగా, అందుకు నొచ్చుకున్న వింధ్యుడు ఓంకార క్షేత్రానికి వెళ్ళి పార్థివలింగాన్ని పూజిస్తాడు. శివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమనగా 'స్వకార్యాన్ని సాధించుకునే శక్తినిమ్మని' కోరుకోగా ఆ వరం ఇస్తాడు శివుడు. ఆ తర్వాత దేవతలంతా వచ్చి స్వామివారిని ఓంకారేశ్వరంలోనే కొలువై ఉండాలని ప్రార్థిస్తారు. వారి కోరిక మేరకు ఆ పరమేశ్వరుడు ప్రణవాకారంలో ఓంకారేశ్వరునిగా ఇక్కడ కొలువై ఉన్నాడని ప్రతీతి. ఇక్కడ ఒకే లింగము రెండు భాగములుగా ఉండి, రెండు పేర్లతో పూజింపబడుతున్నది. సంస్కృత 'ఓం' ఆకారంలో వెలసిన ఓంకారేశ్వర లింగంతో పాటు అమరేశ్వరలింగం కూడా పక్కపక్కనే ఉండడం ఈ క్షేత్రంలో చెప్పుకోదగ్గ విశేషం. ఓంకారేశ్వర జ్యోతిర్లింగం మధ్యన చిన్న చీలిక ఉందట. ఈ చీలిక ద్వారా అభిషేక జలం నర్మదా నదిలో కలిసి పవిత్రీకరిస్తుందని భావిస్తారు. రఘువంశ మూలపురుషుడు మాంధాత ఇక్కడి పర్వతంపై తపస్సు చేసి శివుని ప్రసన్నం చేసుకొన్నాడు. స్వామి అనుగ్రహంతో ఇక్కడే పర్వతం మీద ఆలయం నిర్మించాడు. ఈ క్షేత్రంలోనే ఆదిశంకరాచార్యులవారు ఉపనిషత్తులకు భాష్యం రాశారు. ఇక్కడి గౌరీ సోమనాథ మందిరంలో శివలింగ దర్శనం చేసుకుంటే పునర్జన్మ ఉండదని విశ్వాసం. రాబోయే జన్మ రహస్యాలు కూడా తెలుస్తాయట.



## 5. శ్రీ వైద్యనాథేశ్వరుడు

*పూర్వోత్తరే ప్రజ్వలికానిధానే,*
*సదా వసంతం గిరిజాసమేతమ్।*
*సురాసురారాధితపాదపద్మం,*
*శ్రీవైద్యనాథం తమహం నమామి॥*

జార్ఖండ్‌లోని దియోగర్‌లోని బ్రహ్మ, వేణు, సరస్వతీ నదుల సమీపంలో వైద్యనాథేశ్వరుని క్షేత్రం ఉంది. పూర్వం దేవగృహం అనే పేరు ఉన్న ఈ ప్రదేశాన్ని దేవఘర్ అని పిలిచేవారు. అది కాలక్రమంగా దియోగర్‌గా మారింది. క్షీరసాగర మధనానంతరము ధన్వంతరిని, అమృతాన్ని ఈ లింగములో దాచారనీ, స్పృశించిన భక్తులకు అమృతం లభిస్తుందనే నమ్మకం భక్తులలో ఉంది.

పూర్వం రావణాసురుడు ఆత్మలింగం కోసం పార్థివ లింగాన్ని ప్రతిష్ఠించి శివ పంచాక్షరి మంత్రంతో ప్రార్థించగా, శివుడు ప్రత్యక్షమై ఆత్మలింగాన్ని ప్రసాదిస్తాడు. అయితే ఆ లింగం భూమిని తాకితే అక్కడే స్థిరపడుతుందని కూడా చెప్తాడు. రావణుడు ఆత్మలింగంతో లంకకు వెళ్తూ సంధ్యావందనం చేసేందుకు ఒక పశువుల కాపరికి(దేవతల కోరికపై వినాయకుడే ఆ వేషంలో వస్తాడు) ఇవ్వగా, రావణుడు వచ్చేలోగా ఆ కాపరి ఆ లింగాన్ని కిందపెడ్తాడు. రావణుడు ఎంత పెకలించినా ఫలితం ఉండదు. ఈ జ్యోతిర్లింగం ఎంతో మహిమాన్వితమైనది. సకల వ్యాధులను హరించే క్షేత్రంగా కూడా ప్రసిద్ధి. అంతేకాదు సంసారసాగరంలో పడి కొట్టుకుపోకుండా ఆ భవసాగరం నుంచి ఉద్ధరించే దివ్యక్షేత్రం కూడా ఇదేనని పురాణ ప్రశస్తి. వైద్యనాథ్ ఆలయాన్ని ఒక్క రాత్రిలోనే నిర్మించారని అంటారు. శ్రీ జయదుర్గాదేవి అమ్మవారి ఆలయం శ్రీ వైద్యనాథస్వామి ఆలయానికి ఎదురుగా ఉంటుంది. అర్ధనారీశ్వర తత్వానికి ప్రతిరూపమైన శివశక్తి స్వరూపాలను కలపాలన్న తలంపుతో భక్తులు తమ కోరిక నెరవేరిన తరువాత ఎర్రని దారాలతో రెండు ఆలయాలను అనుసంధిస్తారు. మహారాష్ట్రలోని పర్లిలో గల ఆలయం, కర్నాటకలోని గోకర్ణం ఆలయాన్ని కూడా వైద్యనాథ్ ధామంగా పిలుస్తారు. అయితే శివపురాణం, భవిష్య పురాణం, మత్స్యపురాణం, దేవీ భాగవతంతో పాటు జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరులు రచించిన శ్లోకాల ఆధారంగా జార్ఖండ్‌లో ఉన్న క్షేత్రాన్నే జ్యోతిర్లింగ క్షేత్రంగా నిర్ణయించడం జరిగిందని అంటారు.



## 7. శ్రీ రామేశ్వరుడు

*సుతామ్రపర్ణీజలరాశియోగే,*
*నిబధ్య సేతుం విశిఖైరసంఖ్యైః।*
*శ్రీ రామచంద్రేణ సమర్పితం తం,*
*రామేశ్వరాఖ్యం నియతం నమామి॥*

తమిళనాడులోని రామనాథపురం జిల్లాలో రామేశ్వరంలో ఈ క్షేత్రం ఉంది. శ్రీరామచంద్రుడు ఇక్కడ నుంచే సేతువు నిర్మించి, రావణాసురుని సంహరించిన తర్వాత పాపవిముక్తి కోసం శివుని పూజించాలని శివలింగం తెమ్మని హనుమకు చెప్పగా, హనుమ కైలాసానికి వెళ్తాడు. సుముహూర్తం దాటిపోతున్నా హనుమ రాకపోవడంతో సీతామహాదేవి చేసిన సైకత లింగాన్ని ప్రతిష్టిస్తాడు శ్రీరాముడు. శివలింగంతో తిరిగివచ్చిన హనుమ శివలింగ ప్రతిష్ట జరిగిపోయిందని విచారిస్తుండగా, ఆ సైకత లింగాన్ని తొలగించమని శ్రీరాముడు చెప్తాడు. అయితే హనుమ ఆ లింగాన్ని తొలగించేందుకు ప్రయత్నించి విఫలుడవడంతో ఆ రెండు లింగాలను పక్కపక్కనే ప్రతిష్ఠించారు. శ్రీరాముడు ప్రతిష్ఠించిన లింగం రామేశ్వర లింగంగా, హనుమ తెచ్చిన లింగం విశ్వ లింగంగా ప్రసిద్ధి. రాముడు "విశ్వలింగాన్ని" మొదట పూజించాలని సూచించాడు. ఆనాటి నుండి ఈ సాంప్రదాయం కొనసాగుతోంది. రామేశ్వరం శైవులకు, వైష్ణవులకు అత్యంత పవిత్ర స్థలం.

రామేశ్వరం చుట్టూగల ద్వీపాలలో 64 తీర్థాలు(పవిత్రజల భాగాలు) ఉన్నాయి. స్కాంద పురాణం ప్రకారం, వాటిలో 24 ముఖ్యమైనవి. ఈ తీర్థాలలో స్నానమాచరించడం తపస్సుతో సమానంగా భావిస్తారు భక్తులు. వాటిలో 22 తీర్థాలు రామనాథస్వామి దేవాలయంలోనే ఉన్నాయి. 22 అనే సంఖ్య రాముని యొక్క అమ్ముల పొదిలో గల 22 బాణాలను సూచిస్తుంది. వాటిలో ప్రధాన తీర్థం "అగ్ని తీర్థం". ఆదిశంకరాచార్యులు భారతదేశం నలుమూలలా నాలుగు మఠాలను నెలకొల్పారు. వాటినే చార్‌ధామ్‌లంటారు. అందులో ఒకటిగా ఈ దేవాలయాన్ని నెలకొల్పినట్లు ఆధారాలున్నాయి. మిగిలినవి భద్రీనాథ్, పూరీ, ద్వారకలు.

## లింగాష్టకమ్

బ్రహ్మమురారి సురార్చిత లింగం
నిర్మలభాసిత శోభిత లింగం
జన్మజ దుఃఖ వినాశక లింగం
తత్ప్రణమామి సదాశివ లింగం

దేవముని ప్రవరార్చిత లింగం
కామదహన కరుణాకర లింగం
రావణ దర్ప వినాశన లింగం
తత్ప్రణమామి సదాశివ లింగం

సర్వ సుగంధ సులేపిత లింగం
బుద్ధి వివర్ధన కారణ లింగం
సిద్ధ సురాసుర వందిత లింగం
తత్ప్రణమామి సదాశివ లింగం

కనక మహామణి భూషిత లింగం
ఫణిపతి వేష్టిత శోభిత లింగం
దక్షసుయజ్ఞ వినాశన లింగం
తత్ప్రణమామి సదాశివ లింగం

కుంకుమ చందన లేపిత లింగం
పంకజ హార సుశోభిత లింగం
సంచిత పాప వినాశన లింగం
తత్ప్రణమామి సదాశివ లింగం

దేవగణార్చిత సేవిత లింగం
భావై-ర్భక్తిభిరేవ చ లింగం
దినకర కోటి ప్రభాకర లింగం
తత్ప్రణమామి సదాశివ లింగం

అష్టదళోపరివేష్టిత లింగం
సర్వసముద్భవ కారణ లింగం
అష్టదరిద్ర వినాశన లింగం
తత్ప్రణమామి సదాశివ లింగం

సురగురు సురవర పూజిత లింగం
సురవన పుష్ప సదార్చిత లింగం
పరమపదం పరమాత్మక లింగం
తత్ప్రణమామి సదాశివ లింగం

లింగాష్టకమిదం పుణ్యం యః పఠేశ్శివ సన్నిధౌ శివలోకమవాప్నోతి శివేన సహ మోదతే!



## 6. శ్రీ భీమేశ్వరుడు

*యం డాకినీశాకినికాసమాజైః,*
*నిషేవ్యమాణం పిశితాశనైశ్చ।*
*సదైవ భీమాదిపదప్రసిద్ధం,*
*తం శంకరం భూతహితం నమామి॥*

మహారాష్ట్రలోని భువనగిరి జిల్లా(పూణె వద్ద) భీమానది ఒడ్డున భీమాశంకర పర్వతప్రాంతంలో శ్రీ భీమేశ్వర క్షేత్రం ఉంది. త్రేతాయుగంలో భీమాసురుడనే రాక్షసుడు సహ్యాద్రిపై తల్లి కర్కటితో కలిసి జీవిస్తూ, ప్రజలను పీడిస్తూండేవాడు. కర్కటి, పుష్కసి – కర్కటుల కూతురు. లేక లేక పుట్టిన కూతుర్ని అత్యంత గారాబంగా పెంచసాగారు ఆ రాక్షసదంపతులు. యుక్తవయస్కురాలైన కర్కటిని విరాధునికి ఇచ్చి పెండ్లి చేశారు. ఆ విరాధుడు, శ్రీరామునితో జరిగిన యుద్ధంలో మరణించగా, మరలా కర్కటి తల్లిదండ్రులను ఆశ్రయించింది. ఒకరోజు అగస్త్యుని శిష్యుడైన సుతీక్షణుడు భీమానదిలో స్నానం చేస్తుండగా, కర్కటి తల్లిదండ్రులు అతనిని కబళించేందుకు ప్రయత్నించి, అ ముని శాపానికి గురై భస్మమయ్యారు. తల్లిదండ్రులను కోల్పోయిన కర్కటి అనాథగా మిగిలింది. అనాథగా సహ్యపర్వతంపై తిరుగుతున్న కర్కటిని చూసి, మోహావేశుడైన రావణుని సోదరుడు కుంభకర్ణుడు, ఆమెను బలాత్కరించి, లంకా నగరానికి వెళ్ళిపోయాడు. ఫలితంగా కర్కటి గర్భవతై భీమాసురునికి జన్మనిచ్చింది. తన తల్లి కథను విన్న భీమాసురుడు, దీనంతాటికి కారకుడు రామావతారం ధరించిన విష్ణువేనని, విష్ణువుపై తన పగను తీర్చుకోవాలని, వేయి సంవత్సరాలపాటు బ్రహ్మ గురించి తపస్సుచేసి వరాలను పొందాడు. ఎల్లలోకవాసులను గడగడలాడించిన భీమాసురుడు కామరూప దేశాధిపతి సుదక్షిణుని ఓడించి కారాగృహంలో బంధించాడు. అతని భార్య సుదక్షిణాదేవిని కూడ బంధిస్తాడు. కారాగారంలో సంకెళ్ళతో బంధింపబడినప్పటికీ ఆ దంపతులు, మానస గంగాస్నానం చేస్తూ, ఇసుకలింగాన్ని చేసి ఆరాధించారు. వారి పూజలను చూసిన భీమాసురుడు ఈ లింగం మిమ్ములను రక్షిస్తుందా అంటూ తన కరవాలాన్ని విసురుతాడు. రాక్షసుని కత్తి పార్థివలింగాన్ని తాకినంతనే కోటి సూర్యప్రభలతో స్వామి జ్యోతిర్లింగంగా ఆవిర్భవించి, త్రిశూలంతో రాక్షస సంహారం గావించాడు. సకలలోకవాసులు సంతోషించారు. అప్పట్నుంచి స్వామి లోకకళ్యాణార్థం ఇక్కడనే ఉంటూ భక్తజనావళిని కరుణిస్తున్నాడు. ఎందరో భక్తుల కోరికలను తీరుస్తున్నాడు.



## 8. శ్రీ నాగేశ్వరుడు

*'యామ్యే సదంగే నగరేతి రమ్యే,*
*విభూషితాంగం వివిధైశ్చ భోగైః।*
*సద్భక్తిముక్తిప్రదమీశమేకం,*
*శ్రీ నాగనాథం శరణం ప్రపద్యే॥*

గుజరాత్ రాష్ట్రంలో ద్వారక సమీపంలో నాగనాధ్ వద్ద (గోమతి ద్వారక నుంచి సుమారు 14కి.మీ. దూరం) దారుకావనంలో ఈ క్షేత్రం ఉంది. నేటి దారుకావనాన్నే పురాణాలలో కామ్యకవనమని, ద్వైతవనమనీ పేర్కొన్నారు.

దారుకావనంలో తారకాసురుడు తన పరివారంతో నివసించి, ఆ వనంలో వెళ్ళేవారి ధనాన్ని దోచి, నానాహింసలు పెట్టేవాడు. సుప్రియుడను వైశ్యుడు గొప్ప వ్యాపారి, గొప్ప శివభక్తుడు. వ్యాపార నిమిత్తం ద్వారకా వనంలో వెళుతుండగా, తారకుని అనుచరులు సుప్రియుడును, అతని సిబ్బందిని బంధించి, కారాగారంలో ఉంచారు. మహాభక్తుడగు సుప్రియుడు శివలింగధారి, మెడలోని లింగమును తీసి, అరచేతిలో ఉంచుకుని పూజ చేస్తుండేవాడు. దానిని చూచిన రాక్షస సేవకులు తారకాసురునికి చెప్పారు. తారకాసురుడు సుప్రియునితో "నీవు దైవారాధన చేయవద్దు" అని చెప్పినా, శివ పంచాక్షరీ మంత్ర జపం చేస్తున్న సుప్రియుడు సమాధానం చెప్పలేదు. తారకాసురుడు కోపం పట్టలేక తన చేతిలోని గదచే తలపై కొట్టబోగా, శంకరుడు అక్కడనే జ్యోతి రూపంలో ఆవిర్భవించి, తారకుని సంహరించాడు. సుప్రియుడు కోరికపై దారుకా వనంలోనే "నాగలింగేశ్వర" నామంతో లింగరూపం ధరించాడు. ఈ ప్రదేశంలో పూర్వకాలంలో నాగజాతి ప్రజలు నివసించేవారు. కావున ఈ జ్యోతిర్లింగానికి "నాగేశ్వర లింగం" అనే పేరు వచ్చింది. అరణ్యవాసంలో భాగంగా దారుకా వనంలో ఉన్నప్పుడు పాండవులే స్వయంగా ఆలయం నిర్మించినట్లు పురాణగాథ. దీనికి సంబంధించి కొద్దిగా వివాదం ఉంది. రెండు,మూడు చోట్ల ఉన్న ఆలయాన్ని నాగనాథ జ్యోతిర్లింగంగా పిలుస్తూ ఉన్నారు. అయితే ఎక్కువగా ప్రాచుర్యంలో ఉన్న నాగనాథేశ్వర దేవాలయం మాత్రం గోమతి ద్వారక, బైట్ ద్వారక ద్వీపం మధ్య గుజరాత్ రాష్ట్రంలోని సౌరాష్ట్రలో ఉన్న క్షేత్రాన్నే చెబుతారు.

## 9. శ్రీ విశ్వేశ్వరుడు



*సానందమానందవనే వసంతం, ఆనందకందం హతపాపబృందమ్।*
*వారాణసీనాథ మనాథనాథం, శ్రీవిశ్వనాథం, శరణం ప్రపద్యే॥*

ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఈ క్షేత్రం నెలకొని ఉంది. దేవతలు నివసించే పుణ్యక్షేత్రంగా ప్రఖ్యాతి చెందింది. ఈ సృష్టికి ముందునుంచే కాశీపురం పరమపవిత్రమై విరాజిల్లుతోంది. ఇక్కడ పరమశివుడు సగుణరూపాన్ని ధరించాడు. ఆ స్వరూపం శివశక్తి సమ్మేళనం. పరమాత్మ తన నుండి తేజాన్ని వెలువరించి 5క్రోసుల మేరగల ఒక మహాపట్టణాన్ని ప్రకృతి పురుషులు తపస్సు చేయడానికి నిర్మించాడు. అదే కాశీ పట్టణం. పరమాత్మ ఆదేశానుసారం పురుషుడు సృష్టి నిర్మాణ సామర్థ్యాన్ని పొందేందుకు ఘోర తపస్సు చేశాడు. పరమపురుషుడైన శ్రీమహావిష్ణువు తపస్సు చేస్తుండగా, ఆ తపస్సు వేడికి శరీరం నుండి నీరు కాలువలై ప్రవహించసాగాయి. ఆ జల ప్రదేశాన్ని చూసి ఆదినారాయణుడు ఆశ్చర్యచకితుడై తల ఊపాడు. ఆ ఊపుకు మణులతో కూడిన చెవి కమ్మ ఊడి ఒకచోట పడింది. ఆ చెవి పోగు ఊడిపడిన స్థలమే 'మణికర్ణి'గా ప్రసిద్ధమైంది. అనంతమైన జలరాశినుండి కాశీపట్టణాన్ని పరమశివుడు తన శూలాగ్రంపై ధరించి కాపాడాడు. జలం పైభాగంలో యోగనిద్రాపరవశుడైయున్న నారాయణుని నాభికమలం నుండి బ్రహ్మ ఉదయించి, శివాజ్ఞను అనుసరించి సృష్టి చేయడానికి ఉద్యుక్తుడయ్యాడు. ముందుగా బ్రహ్మ పంచశత్కోటి యోజన పరిమితమగు బ్రహ్మాండాన్ని సృజించి, నాలుగు వైపులా పధ్నాలుగు భువనాలను నిర్మించాడు. ఆ బ్రహ్మాండం మజ్జిగలో వెన్నముద్ద వలె తేలియాడసాగింది. ఐరావతాదులతో బ్రహ్మాండం సుస్థిరంగా నిలిచి ఉంది. ఈ బ్రహ్మాండంలో సగం మధ్యభాగం, మిగిలిన సగభాగంలో సగం ఊర్ధ్వభాగం, ఇక మిగిలిన పాతికభాగం అథోలోకమని చెప్పబడుతోంది. అప్పుడు దేవతలంతా పరమశివుని ప్రార్థించి, భూలోకవాసులను కాపాడేందుకు ఇక్కడే శాశ్వతంగా ఉండమని విన్నవించుకున్నారు. వారి మనవి మేరకు పరమశివుడు విశ్వేశ్వరనామంతో జ్యోతిర్లింగమై కాశీ పట్టణంలో వెలసి భక్తులను అనుగ్రహిస్తున్నాడు. కాశీలో మరణించినవారికి శివుడు కుడిచెవిలో శ్రీరామ తారకమంత్రోపదేశం చేసి మోక్షం ఇస్తాడు.

## 10. శ్రీ త్ర్యంబకేశ్వరుడు



*సహ్యాద్రిశీర్షే విమలే వసంతం, గోదావరీతీర పవిత్ర దేశే।*
*యద్దర్శనాత్ పాతకమాశునాశం ప్రయాతి తం త్ర్యంబకమీశమీడే॥*

త్ర్యంబకేశ్వరుడు మహారాష్ట్రలోని నాసిక్ పట్టణానికి 28 కిలోమీటర్ల దూరంలో త్రయంబకంలో కొలువై ఉన్నాడు. ఈ క్షేత్రమే గోదావరి జన్మస్థానం. ఈ క్షేత్రాన్ని త్రిసంధ్యాక్షేత్రమని కూడా పిలుస్తుంటారు. త్ర్యంబకేశ్వరుడు స్వయంభువుడు. అమ్మవారు త్ర్యంబకేశ్వరి. స్వామివారి ఆకృతి విచిత్రంగా ఉంటుంది. ఇక్కడ పానవట్టం మధ్యలో లింగం ఉండదు. ఆ స్థానంలో రుబ్బురోలు లోపలిభాగంవలె గుంటతో లోతుగా ఉంటుంది. త్రయంబకేశ్వరుడు అనగా పరమశివుడు. 'అంబక 'మంటే 'నేత్ర' మని అర్థం. 'త్రయం' అంటే మూడు నేత్రాలు గల దేవుడు త్రయంబకుడు. సూర్యుడు, చంద్రుడు, అగ్ని – అనే మూడు తేజస్సులు మూడు నేత్రలుగా వెలసిన దేవుడు. ఫాలభాగంలోని మూడవ నేత్రమే అగ్నినేత్రం. స్వర్గం, ఆకాశం, భూమి – అనే మూడు స్థానాలకు సంరక్షకుడైన తండ్రి శివుడు అని కూడా త్రయంబక శబ్దాన్ని వివరిస్తారు. 'త్రయంబకం యజామహే – సుగంధిం పుష్టి వర్ధనమ్'... మృత్యుంజయ మహామంత్రంతో మృత్యువు అనగా మరణం నుండి విముక్తి చేయమని భక్తులు శివుణ్ణి ప్రార్థిస్తారు. నాసిక్, త్రయంబకం ప్రదేశాలు సత్యయుగానికి చెందినవని మన పురాణాలలో వివరించారు. ద్వాపరయుగంలో శ్రీరాముడు, సీతా లక్ష్మణ సమేతుడై నివసించిన పంచవటి నాసిక్ నగరానికి సమీపంలో ఉంది. లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు చెవులు కోసిన ప్రదేశం, రావణాసురుడు సీతను అపహరించుకుపోయిన ప్రదేశం కూడా ఇదే. రామభక్త హనుమాన్‌గా పేరుపొందిన ఆంజనేయుని జన్మస్థలం త్రయంబకానికి సమీపంలోని అంజనేరి గ్రామమే. త్రయంబకంలో ఉన్న త్రయంబకేశ్వరుడు జ్యోతిర్లింగం. జ్యోతిర్లింగంలో శివుడు అగ్ని రూపంలో కొలువై వుంటాడు

## 11. శ్రీ కేదారేశ్వరుడు



*మహాద్రిపార్శ్వే చ తటే రామంతం, సంపూజ్యమానం సతతం మునీంద్రైః।*
*సురాసురైర్యక్ష మహోరగాద్యైః కేదారమీశం శివమేకమీడే॥*

ఉత్తరాంచల్ రాష్ట్రంలో గౌరీకుండ్ సమీపంలోగల హిమాలయ శిఖరం మీద మందాకిని నదీ తీరంలో సముద్ర మట్టానికి 3585మీటర్ల ఎత్తులో ఈ క్షేత్రం కొలువై ఉంది. కేదార్‌నాథ్ ఆలయం గర్భగుడిలో అందరూ ఊహించినట్టు శివలింగం ఉండదు. కేవలం ఒక మహిషం తోకలా మాత్రమే కనిపిస్తుంది. దీని వెనక ఓ కథ ఉంది. కురుక్షేత్ర యుద్ధంలో ఎంతోమందిని హతమార్చాం కాబట్టి ఆ పాతకం తమకు అంటుకుంటుందని, దాని నుంచి పాప విమోచనం కోసం పాండవులు ద్రౌపతితో కలిసి శివుడిని వెతుక్కుంటూ హిమాలయాలకు వెళతారు. ఎన్నిరోజులు కష్టించి వెతికినా శివదర్శనం జరగలేదు. చివరికి కేదార్‌నాథ్ ఉండే చోటుకు వస్తారు. దీంతో శివుడు మహిషంలా మారిపోతాడు. శివుడును వెతుక్కుంటూ వచ్చిన పాండవులకు ఈ మహిషం కనిపిస్తుంది. ఇంత మంచులో ఇక్కడ మహిషం ఎందుకుందన్న అనుమానం ధర్మరాజుకు వచ్చి, ఆ మహిషమే శివునిగా భావించి ఆ మహిషాన్ని పట్టుకునేందుకు ప్రయత్నించగా, మహిష రూపంలో ఉన్న శివుడు హఠాత్తుగా మంచులోకి దూసుకుపోబోగా పాండవులకు మహిషం తోక భాగం మాత్రమే అందుతుంది. ఆ భాగమే ఇప్పుడు కేదార్‌నాథ్‌లో కనిపిస్తుంది. మంచులో కూరుకుపోయిన తల భాగం హిమాలయాల ఆవలివైపు అంటే ఖాట్మండులో ప్రత్యక్షమవుతుంది. అందుకే కేదార్‌నాథ్‌ను దర్శించుకున్న తర్వాత భక్తులు నేపాల్ వెళ్లి పశుపతినాథ్ ఆలయాన్ని దర్శించుకుని తరిస్తుంటారు. ఈ జ్యోతిర్లింగ క్షేత్రం యేడాదికి ఆరు నెలలు మాత్రమే తెరవబడి ఉంటుంది. సాధారణంగా భక్తులు మొదట యమునోత్రి, గంగోత్రిలను సందర్శించి అక్కడ నుండి పవిత్ర జలాలను తీసుకొచ్చి కేదారేశ్వరుడిని అభిషేకిస్తుంటారు.

## 12. శ్రీ ఘృష్ణేశ్వరుడు



*ఇలాపురే రమ్య విశాల కేస్మిన్, సముల్లసంతం చ జగద్వరేణ్యమ్।*
*వందే మహోదారతరస్వభావం, ఘృష్ణేశ్వరాఖ్యం శరణం ప్రపద్యే॥*

మహారాష్ట్ర ఔరంగబాద్ పట్టణానికి 30 కిలోమీటర్ల దూరంలో అజంతా ఎల్లోరా గుహల సమీపంలో దేవగిరి కొండపై ఘృష్ణేశ్వర జ్యోతిర్లింగం వెలసింది. ఈ ప్రాచీన ఆలయం ఎంతో మహిమాన్వితమైనది. ఘృష్ణేశ్వర జ్యోతిర్లింగం గురించి పురాణాల్లో ఓ కథ ఉంది. పూర్వం దేవగిరి దుర్గంలో సుధర్ముడు అనే బ్రాహ్మణుడు తన భార్య సుదేహతో కలిసి ఉండేవాడు. వారు నిత్యం అనేక పూజలు, నైతిక కార్యక్రమాలను నిర్వహించేవాడు. కానీ వారికి సంతానం లేక బాధపడేవారు. ఆ సమయంలో సుదేహ తన చెల్లెలైన ఘుష్మను భర్తకు ఇచ్చి వివాహం చేయాలనుకుంటుంది. వివాహానికి ముందే వారిని చూసి ఈర్ష్యపడనని వాగ్దానం చేస్తుంది. వివాహం అయిన తరువాత అక్కాచెల్లెల్లిద్దరూ ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. కాలక్రమేణా ఘుష్మకు మగ సంతానం కలిగింది. కొంతకాలానికి ఘుష్మ కుమారుడికి వివాహం జరుగుతుంది. చెల్లెలి సంతానం అభివృద్ధి చెందడం సహించలేని సుదేహ.. ఘుష్మ కుమారుడిని చంపి కోనేటిలో పడేస్తోంది. శివ భక్తురాలైన ఘుష్మ 'ఇదంతా పరమేశ్వరుని లీల' అనుకుంటూ ముక్కంటిని స్తుతిస్తుంది. అప్పుడక్కడ ప్రత్యక్షమైన పరమేశ్వరుడు జరిగిన విషయాన్ని ఘుష్మకు వివరిస్తాడు. పరమశివుడు సుదేహని సంహరించడానికి ఉపక్రమించగా వద్దని ఘుష్మ ప్రాధేయపడుతుంది. దాంతో పరమేశ్వరుడు సుదేహకు పాపపరిహారం కల్పిస్తాడు. అప్పుడు ఘుష్మ స్వామిని తన పేరు మీద అక్కడ కొలువుదీరమని వేడుకుంటుంది. అంతట ఆ స్వామి అక్కడ స్వయంభువుగా కొలువయ్యాడు. ఘుశమేశుడిగా వెలసిన పరమేశ్వరుడు ఇక్కడ నిత్యం పూజలు అందుకుంటున్నాడు. ఆ ఘుశమేశుడే కాలక్రమంలో ఘృష్ణేశ్వరుడిగా ప్రసిద్ధి చెందాడు.

# 'పంచభూతాత్ముని' పంచభూత లింగాలు

ప్రాణికోటికి ఆధారమైనవి పంచభూతాలు. అవి భూమి, ఆకాశం, గాలి, నీరు, నిప్పు. ఈ ఐదు మూలకాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నవే పంచభూత స్థల దేవాలయాలు. అనంతమైన జ్ఞాన తేజస్సే శివుడు, సర్వమంతటా వ్యాపించిన మహాతేజస్సే శివుడు. లయకారుడైన శివుడిని ఎక్కడ వెదకాలని పరితపించే భక్తులకు ఈ పంచభూత స్థలదేవాలయాలు ఆహ్వానం పలుకుతున్నాయి. ఇందులో నాలుగు దేవాలయాలు తమిళనాడులో ఉండగా, ఒకటి ఆంధ్రప్రదేశ్‌లో ఉంది. శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆ మహాదేవుడిని స్మరించుకుంటూ...

## 1. 'ఆకాశలింగం'.. శ్రీ నటరాజస్వామి ఆలయం



తమిళనాడులోని చిదంబరంలో పరమశివుడు 'ఆకాశ లింగం'గా శ్రీ నటరాజస్వామిగా కొలువై ఉన్నాడు. ఈ క్షేత్రం పరమశివుడు ఆనందతాండవం చేసిన ప్రదేశంగా ప్రసిద్ధి. ఈ ఆలయానికి 9 ద్వారాలుంటాయి. గర్భగుడిలో నటరాజ స్వామికి కుడిపక్కన చిన్న ద్వారానికి తెర వేసి ఉంటుంది. ఇక్కడొక మహిమగల యంత్రం ఉందని అంటారు. తెర తీసినప్పుడు భగవంతుని ఉనికిని తెలిపే బంగారు బిల్వ పత్రాలు కనిపిస్తాయి. ఈ తెర బయటివైపు అజ్ఞానాన్ని సూచించే నలుపు రంగు, లోపలి వైపు జ్ఞానానికి, ముక్తికి ప్రతీకగా ఎరుపు రంగు కనిపిస్తాయి. పంచభూతాల్లో ఒకటైన 'ఆకాశానికి' ప్రతీకగా ఉండే ఈ ఆలయం భక్తులను ఎంతగానో ఆశ్చర్యపరుస్తుంది.

## 2. 'పృథ్వీ' లింగం..శ్రీ ఏకాంబరేశ్వరాలయం



తమిళనాడులోని కంచి ఉత్తరభాగాన్ని శివకంచి అంటారు. పంచభూత క్షేత్రాల్లో ఒకటైన శ్రీఏకాంబరేశ్వరాలయం ఇక్కడ పృథ్వి (భూమి)కి సంకేతంగా ఉంటుంది. భారతదేశంలో ఉన్న అతిపెద్ద గోపురాల్లో ఈ ఆలయం ఒకటి. కంచిలో ఉన్న ఓ మామిడిచెట్టు కింద వెలిశాడు కాబట్టి ఏకాంబరుడు అనే పేరు వచ్చింది. ఈ స్వామి 'భూమి'ని సూచిస్తాడని ప్రతీతి. ఈ ఆలయంలో 1008 శివలింగాలు ప్రతిష్ఠించబడి ఉండడమే కాకుండా, దాదాపు 3,500 సంవత్సరాల వయస్సు గల మామిడి వృక్షం ఇక్కడ ఉంది. ప్రస్తుతం ఆ మామిడి చెట్టు కాండాన్ని మాత్రమే మనం చూడగలం. ప్రాచీనమైన ఈ దేవాలయం ఎంతో మహిమాన్వితమైనది.

## 3. 'వాయు'లింగం..శ్రీకాళహస్తీశ్వరాలయం



ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తిలో ఆ పరమేశ్వరుడు 'వాయు'లింగంగా, శ్రీకాళహస్తీశ్వరునిగా వెలసి ఉన్నాడు. దక్షిణ కాశిగా ఈ క్షేత్రం ప్రసిద్ధి. తనను భక్తితో సేవించిన శ్రీ (సాలీడు), కాళ (పాము), హస్తి (ఏనుగు)లను అనుగ్రహిస్తూ ఆ ఈశ్వరుడు భక్తుల పేర్లతోనే వెలసి వాటికి శాశ్వతస్థానం కల్పించడం విశేషం. ఆ మూడు పేర్లతో ప్రసిద్ధి చెందిన ఆలయమే శ్రీకాళహస్వీశ్వరాలయం. ఆలయ గర్భగుడి లోని రెండు దీపాలలో ఒకటి ఎప్పుడూ గాలికి కదులుతూ ఉంటుంది, మరొకటి ఎల్లప్పుడూ నిలకడగా ఉంటుంది. అందుకే ఈ లింగం వాయులింగంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ నిర్మితమైన కళ్ళు చెదిరే మూడు గోపురాలు ప్రాచీన భారతీయ శిల్పకళకు నిదర్శనం.

## 4. 'జల'లింగం..శ్రీ జంబుకేశ్వరాలయం



తమిళనాడులోని తిరుచిరాపల్లి సమీపంలో ఉన్న శ్రీ జంబుకేశ్వరాలయం ఆ పరమేశ్వరుని 'జల' లింగంగా ప్రసిద్ధి. ఈ ఆలయంలోని శివలింగం పానవట్టం నుంచి ఎల్లప్పుడూ నీళ్ళు ఊరుతూనే ఉంటాయి. అందుకు సాక్ష్యంగా అర్చకులు ఆ నీటిని ఒక వస్త్రంతో పిండి చూపిస్తుంటారు. అందుకే ఇది జల లింగంగా ప్రఖ్యాతి చెందింది. పవిత్రమైన కావేరి నది ఒడ్డున ఈ ఆలయం ఉంది. ఈ ఆలయానికి తిమేవకాయ్, తిరువనై కావల్ అనే పేర్లు కూడా ఉన్నాయి. ఏనుగులచేత కూడా పూజలందుకుంటున్న క్షేత్రమని, తెల్లనేరేడు (జంబుక వృక్షాలు) చెట్లు అత్యధికంగా ఉన్న ప్రాంతం కనుక ఈ దేవాలయానికి జంబుకేశ్వరాలయంగా పేరు వచ్చిందని కూడా అంటారు.

## 5. 'అగ్ని'లింగం.. శ్రీ అరుణాచలేశ్వరాలయం



వేదాలు సైతం కొనియాడిన మహాపుణ్యక్షేత్రం అరుణాచలేశ్వరాలయం. 'అగ్ని'భూతమునకు ఇది ప్రతీక. ఆ పరమేశ్వరుని జ్యోతిర్లింగ స్వరూపంగా వెలసిన ఈ కొండే ఒక దివ్యక్షేత్రంగా అలరారుతోంది. అరుణాచలం అన్న పేరుకు ఒక ప్రత్యేకత ఉంది. 'అరుణ' అనగా ఎర్రని, 'అచలము' అంటే కొండ అని అర్థం. ఆ-రుణ అంటే పాపములను పరిహరించునది అని అర్థం. స్మరణ మాత్రం చేతనే ముక్తి నొసగే క్షేత్రం అరుణాచలం. దక్షిణామూర్తి స్వరూపంగా పేర్కొనబడే ఈ కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తే చాలు.. సాక్షాత్తూ ఆ మహాశివుని చుట్టూ ప్రదక్షిణ చేసినట్లే. నిత్యం లక్షలాదిమంది భక్తులు ఈ గిరిప్రదక్షిణ చేస్తుండడం ఈ క్షేత్ర మహిమకు నిదర్శనం.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com